


# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 194 | పేజీలు : 8 | వెల : రూ.2/- ఆదివారం 09 ఆగస్టు 2026

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## 10న కలిదిండికి సిఎం చంద్రబాబు రాక


రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొననున్న సిఎం



## 17 నుంచి ఎపి శాసనసభ సమావేశాలు

అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 08: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 17వ తేదీన ఉదయం 10 గంటలకు శాసన మండలి మిగతా2లో...



## ప్రశ్నలతో ఆగొద్దు.. పరిష్కారాలు చూపండి

యువత సామర్థ్యాలపై పూర్తి నమ్మకం ఉంది

వారి ఆలోచనలు, నిర్ణయాలే వికసిత్ భారత్‌కు దిశానిర్దేశం : ప్రధాని మోడీ

ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు

న్యూఢిల్లీ ,మన జనప్రగతి ఆగస్టు 08: దేశ యువత సమస్యలను గుర్తించి ప్రశ్నించడం మాత్రమే కాకుండా, వాటికి పరిష్కారాలను కనుగొనే దిశగా ఆలోచించాలని ప్రధాని మోడీ సూచించారు. యువత సామర్థ్యాలపై తనకు పూర్తి నమ్మకం ఉందని అన్నారు. వికసిత్ భారత్ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాల్సి ఉందని పిలుపునిచ్చారు. ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మోడీ..పట్టభద్రులైన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు ఇప్పుడు అడుగుపెడుతున్న ప్రపంచం వేగంగా మారుతోందని చెప్పారు. సాంకేతికతతో పాటు అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయ న్నారు. రాబోయే 20--30 ఏండ్లలో ప్రపంచంలో ఎలాంటి మార్పులు మిగతా2లో...

## ఎల్‌నినోతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● జలధార - జలహారతి ఇక నిరంతర కార్యక్రమం ● సాగు,తాగునీటితో పాటు, పరిశ్రమలకు నీటి సరఫరా ● పక్కా ప్రణాళికతో ముందుకు సాగాల్సిందే ● అధికారులకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం



అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 08: జలధార – జలహారతి ఇక నిరంతర కార్యక్రమమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. జలధార – జలహారతిపై సీఎం శనివారం సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు ప్రణాళికతో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నీటి లభ్యత తగ్గినా పరిశ్రమలకు అవసరమైన నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. నీటి పొదుపు, వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు. ఆయా జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ ఏడాది సాధారణం కంటే 39 శాతం మిగతా2లో...



## వివేకా హత్యకేసు విచారణలో అవకతవకలు

- మరోమారు వైఎస్ సునీత ఆరోపణలు

కడప,మన జనప్రగతి ఆగస్టు 08: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి కుమార్తె వైఎస్ సునీతా రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. వివేకా హత్య కేసు విచారణలో మిగతా2లో...

## డిలిమిటేషన్‌పై తమిళనాట ఆసక్తికర సన్నివేశం

సిఎం విజయ్ నేతృత్వంలో అఖిలపక్ష ఎంపిల భేటీ

ఉన్న ఎంపి సీట్లను అలాగే కొనసాగించాలని డిమాండ్



చెన్నై,మన జనప్రగతి ఆగస్టు 08: కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 'డీలిమిటేషన్' ప్రక్రియపై తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. రాష్ట్ర రాజకీయ ప్రాతినిధ్యం తగ్గకుండా అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ శనివారం చెన్నైలోని కలైవానర్ అరంగంలో తమిళనాడు ఎంపీలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. అయితే, రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకేలతో పాటు పీఎంకే, డీఎండీకే ఈ భేటీని బహిష్కరించడం చర్చనీయాంశమైంది. పార్టీ రాజకీయాలకు అతీతంగా తమిళనాడు హక్కుల పరిరక్షణెళి లక్ష్యంగా కాంగ్రెస్, విసికె, సిపిఐ సిపిఎం, ఎండిఎంకె, ఐయూఎంఎల్ పార్టీలకు చెందిన దాదాపు 21 మంది లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఈ భేటీలో మిగతా2లో...

## 2028 నాటికి ఎయిర్ ట్యాక్సీలు

కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై పరీక్షలు

విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు






## నేడు,రేపు హైదరాబాద్ బోనాలు

- పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్,మన జనప్రగతి ఆగస్టు 08:హైదరాబాద్‌లో బోనాల ఉత్సవాలు ఆగస్టు 9, 10 తేదీల్లో జరగనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు. లాల్ దర్వాజా, కార్వాన్ దర్బార్ మైసమ్మ, అంబర్‌పేట్ మహంకాళి, చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయాల పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు వెల్లడించారు. లాల్ దర్వాజా బోనాల మిగతా2లో...

## మహిళా బిల్లుపై మాటల యుద్ధం

- కేంద్రమంత్రి కిరణ్ రిజిజుకు రాహుల్ కౌంటర్



న్యూఢిల్లీ,మన జనప్రగతి ఆగస్టు 08: మహిళా రిజర్వేషన్ అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మరోసారి మాటల యుద్ధం మొదలైంది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు.. 'ఎక్స్' సోషల్ మీడియా వేదికగా పరస్పరం స్పందించారు. మహిళా శక్తిపై రాహుల్ వ్యాఖ్యలను స్వాగతించిన రిజిజు.. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ బేషరతుగా మద్దతివ్వాలని కోరారు. దీనికి ఘాటుగా బదులిచ్చిన రాహుల్.. మహిళలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచేందుకు అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు. వీడియోపై రిజిజు స్పందిస్తూ.. 'కాంగ్రెస్ పార్టీలో ఇది సానుకూల సందేశంగా కనిపిస్తోంది. రాహుల్ వైఖరిలో మహిళల విషయంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది' అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఇదే సమయంలో మహిళా రిజర్వేషన్ అంశాన్ని ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఎలాంటి మిగతా2లో...

## ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

15 ఆగస్ట్‌న ప్రారంభించనున్న సిఎం



మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
09- 08 - 2026

# ప్రశ్నలతో ఆగొద్దు..పరిష్కారాలు చూపండి

(మొదటి పేజీ తరువాయి)

వస్తాయో ముందుగానే చెప్పడం సాధ్యం కాదని చెప్పారు. అందువల్ల యువతలో ఎప్పుడూ నేర్చుకోవాలనే ఆసక్తి ఉండా లన్నారు. జీవితాంతం విద్యార్థులుగా కొనసాగాలని సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త విషయాలను నేర్చుకునేవారే విజయాన్ని అందుకుంటారని తెలిపారు.**సమస్యలను చూసి భయపడొద్దు** జీవితంలో వచ్చే సమస్యలను చూసి భయపడాల్సిన అవసరం లేదని, పెద్ద సవాళ్లను చిన్న చిన్న భాగాలుగా విభజించి వాటికి పరిష్కారాలను అన్వేషించాలని మోడీ సూచించారు. కొత్త ఆలోచనలు, వినూత్న పరిష్కారాలను కనుగొనే ధైర్యం ఉంటే సవాళ్లను అవకాశాలుగా మార్చుకోవచ్చునన్నారు. ప్రతి తరానికీ దేశం పట్ల బాధ్యత ఉంటుందని మోడీ వివరించారు. రాబోయే 30--35 ఏండ్లలో యువత తీసుకునే నిర్ణయాలు, చేపట్టే కార్యక్రమాలే వికసిత్ భారత్ దిశను ప్రభావితం చేస్తాయని అన్నారు. తాము తీసుకునే ప్రతి నిర్ణయం దేశానికి ఎంతవరకు ఉపయోగపడుతుందో యువత ఆలోచించాలని పిలుపునిచ్చారు. దేశ ప్రయోజనాల కోసం తాము ఏమి చేయగలమనే ప్రశ్నను ప్రతి యువకుడు తనకు తాను వేసుకోవాలని మోడీ సూచించారు.

**విద్యార్థులకు స్వర్ణ పతకాలు ప్రదానం**

స్నాతకోత్సవంలో ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులకు దీన్‌దయాల్ శర్మ స్వర్ణ పతకం, డైరెక్టర్ స్వర్ణ పతకాలను మోడీ ప్రదానం చేశారు. పురస్కారాలు అందుకున్నవారిలో మహిళల సంఖ్య తక్కువగా ఉండటాన్ని ఆయన ప్రస్తావిస్తూ.. మరింత మంది మహిళలు ఈ స్థాయిలో ప్రతిభ చూపాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఐఐటీ ఢిల్లీ సోనిపత్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ఏఐ ఆధారిత సూపర్ కంప్యూటింగ్ కేంద్రం 'పరం ప్రజ్ఞ'ను ప్రధాని ప్రారంభించారు.

# ఎల్‌నినోతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. జూన్ నుంచి డిసెంబర్‌లో సాధారణ వర్షపాతం 867 మిల్లిమీటర్లుగా ఉందని వెల్లడించారు. కాగా.. ప్రస్తుతం 525 మిల్లిమీటర్లు మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఆగస్టులో 56 శాతం లోటు వర్షపాతం ఉండే అవకాశం ఉందని తెలిపారు. రిజర్వాయర్ల నీటి నిల్వలపైనా ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశాలు ఉన్నాయని సీఎం అభిప్రాయపడ్డారు. ఏపీలోని వివిధ బేసిన్లలో ప్రస్తుతం 563.05 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. గతేడాది ఇదే సమయానికి 825.67 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. ఆగస్టు నుంచి భూగర్భ జలమట్టాలు మరింత పడిపోయే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. తాగునీటి నిల్వలు, సరఫరాపై పక్కా ప్రణాళిక రూపొందించాలని సీఎం మార్గనిర్దేశర చేశారు. వెలుగోడు, గోరకల్లు, అవుకు, జీడిపల్లి, చెర్లోపల్లి రిజర్వాయర్లలో తాగునీటిని నిల్వ చేయాలని సూచించారు.నాగార్జునసాగర్ కాలువల ద్వారా వివిధ జిల్లాలకు తాగునీటి కేటాయింపులు సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. అందుబాటులోకి వచ్చిన నీటిని ఒడిసి పట్టుకోవాలని సూచించారు. ఆయా ప్రాజెక్టుల్లోకి వస్తున్న నీటిని సమర్థంగా వినియోగించి రిజర్వాయర్లు నింపాలని మార్గనిర్దేశర చేశారు. తాగునీటి వసతి లేని ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమైన ప్రాంతాలకు నీటి సరఫరా కోసం ట్యాంకర్లను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల్లోనూ సాగులో ఉన్న పంటలను కాపాడాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని ప్రాధాన్యం మేరకు వినియోగించాలని మార్గనిర్దేశర చేశారు. తక్కువ నీటి వినియోగంతో సాగు చేసే పంటలను భవిష్యత్తులో ప్రోత్సహించాలని సూచించారు. వర్షాభావంతో పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పశువులకు మేత, నీటి లభ్యతను ముందుగానే నిర్ధారించాలని పేర్కొన్నారు. అవసరమైన ప్రాంతాల్లో గోకులాలను సిద్ధం చేయాలని సూచించారు. పశుసంపద రక్షణకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. నీటి వనరుల సంరక్షణ నిరంతరం కొనసాగాలని సీఎం తెలిపారు. చాలాకాలంగా నీటి లభ్యత లేని చెరువులు, కాల్వలను గుర్తించి నీరు అందించాలని సూచించారు. అదనపు నీరు ఉన్న ప్రాంతాల నుంచి కొరత ఉన్న ప్రాంతాలకు మైక్రో బేసిన్ అనుసంధాన అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. జలధార - జలహారతి కింద 82,865 పనులు గుర్తించామని.. 79,826 పనులు పూర్తి అయ్యాయని చెప్పుకొచ్చారు. జలధార - జలహారతి కింద రూ.3,409.35 కోట్ల పనులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. చెరువులు, ఫీడర్ ఛానళ్లు, ఫార్మ్ పాండ్లు, ట్రెంచ్‌ల తవ్వకం పనులు చేపట్టినట్లు అధికారులు వివరించారు. ముందస్తు ప్రణాళికతో పనిచేస్తే భవిష్యత్తు నీటి సమస్యలను సమర్థంగా ఎదుర్కొవచ్చని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# డిలిమిటేషన్‌పై తమిళనాట ఆసక్తికర సన్నివేశం

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. దేశ వ్యాప్తంగా లోక్‌సభ స్థానాల సంఖ్యను 543 వద్దే ఉంచాలని ఈ సందర్భంగా ఎంపీలు డిమాండ్ చేశారు. తమిళనాడుకు ప్రస్తుతం ఉన్న 39 లోక్‌సభ స్థానాల కేటాయింపులో ఎలాంటి మార్పులు చేయకూడదని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా తమిళనాడు, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేశాయని ఎంపీలు గుర్తుచేశారు. ఇప్పుడు కేవలం జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల సంఖ్యను పెంచితే, జనాభా పెరిగిన ఉత్తరాది రాష్ట్రాలకు లబ్ధి చేకూరి, దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తీవ్రంగా తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమిళనాడు పాత్రను పార్లమెంట్‌లో తగ్గించే ఏ డీలిమిటేషన్ సూత్రాన్నైనా తీవ్రంగా నిరసిస్తామని, లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచితే అది ప్రభావవంతమైన పార్లమెంట్ కాబోదని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం పేర్కొన్నారు. తమిళనాడును ఇన్నేళ్లు పాలించిన డీఎంకే, అన్నాడీఎంకేలు రాష్ట్ర హక్కుల కోసం నిర్వహిస్తున్న భేటీకి రాకపోవడం విచారకరమని, వారికి రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యమని కాంగ్రెస్ ఎంపీలు ప్రవీణ్ చక్రవర్తి, విష్ణు ప్రసాద్ విమర్శించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన 57 మంది ఎంపీలలో 36 మంది ఈ భేటీకి దూరంగా ఉండటం, విజయ్ ప్రభుత్వానికి స్పష్టమైన ఎజెండా లేదంటూ డీఎంకే ఆరోపించడం.. తమిళనాడు రాజకీయ సమీకరణాలను మరింత ఆసక్తికరంగా మార్చాయి.

# 2028 నాటికి ఎయిర్ ట్యాక్సీలు

**బెంగళూరు,మన జనప్రగతి ఆగస్టు 08:** 2028 నాటికి దేశంలో ఎలక్ట్రిక్ ఎయిర్ టాక్సీలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని, ఈ కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై పరీక్షలు వచ్చే ఏడాది వేగవంతం కానున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. బెంగళూరులో సర్లా ఏవియేషన్ కొత్త ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవంలో రామ్మోహన్ నాయుడు మాట్లాడారు.ఎలక్ట్రిక్ వర్టికల్ టేక్-ఆఫ్ అండ్ ల్యాండింగ్ విమానాలు బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి రద్దీగా ఉండే మహానగరాలకు కొత్త రవాణా మార్గాన్ని అందించగలవని అన్నారు. బెంగళూరులోనే కాకుండా, ముంబై, ఢిల్లీలలో కూడా వీటికి చాలా అవసరం ఉందని ఆయన చెప్పారు. 2028 నాటికి దేశంలో ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీలను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఎలక్ట్రిక్ వర్టికల్ టేక్-ఆఫ్ అండ్ ల్యాండింగ్ సాంకేతికత ద్వారా బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి మహానగరాల్లో ట్రాఫిక్ సమస్య భారీగా తగ్గుతుందని మంత్రి తెలిపారు.

గంటన్నర నుంచి రెండు గంటలు పట్టే ప్రయాణ సమయం కేవలం 20 నుంచి 30 నిమిషాలకు తగ్గుతుందని స్పష్టం చేశారు.'సర్లా ఏవియేషన్' కంపెనీకి డిజైన్ ఆర్గనైజేషన్ అప్రూవల్ ను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ మంజూరు చేసిందని, నిబంధనలు, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా వచ్చే ఏడాది పూర్తిస్థాయి టెస్టింగ్ ఫేజ్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఎయిర్ ట్యాక్సీ ప్రత్యేకతలు ముఖ్యంగా ఇది పైలట్‌తో పాటు ఆరుగురు ప్రయాణికులను తీసుకెళ్లగలదు. ఇందులో మొత్తం 7 ఎలక్ట్రిక్ మోటార్లు ఉంటాయి (6 టేకాఫ్ కోసం, 1 ముందుకు వెళ్లేందుకు) ఇది ప్యూర్ ఎలక్ట్రిక్ ఆధారిత విమానం అయినప్పటికీ, అవసరమైతే గాల్లోనే బ్యాటరీ ఛార్జ్ చేసుకునేలా టర్బో-జెనరేటర్ అమర్చే వెసులుబాటు కూడా దీని డిజైన్‌లో ఉంది. స్వదేశీ తయారీ కావడంతో తక్కువ ధర: విమానయాన పరికరాలు (అవియోనిక్స్) మినహా మిగిలిన విడిభాగాలన్నీ భారత్‌లోనే తయారు కానున్నందున ప్రయాణ ధరలు సామాన్యులకు సైతం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని రామ్మోహన్ నాయుడు అభిప్రాయపడ్డారు. నిఖిల్ కామత్ (జెరోధా), బిన్నీ బన్సాల్ (ఫ్లిప్‌కార్ట్) వంటి దిగ్గజాల మద్దతు ఉన్న ఈ స్టార్టప్‌తో ఇప్పటికే బెంగళూరు ఎయిర్‌పోర్ట్ శంషాబాద్/లాస్ట్ మైల్ కనెక్టివిటీ కోసం, మణిపాల్ హాస్పిటల్స్ ఎయిర్ అంబులెన్స్ సేవల కోసం ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ సాంకేతికత అందుబాటులోకి వస్తే నగర ప్రయాణాలే కాకుండా ఎయిర్ అంబులెన్స్, అత్యవసర వైద్య రవాణా, కార్గో సేవల రంగంలో భారత్ సరికొత్త రికార్డు సృష్టించడమే కాక విదేశాలకు కూడా విమానాలను ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటుందని కేంద్ర మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

# నేడు,రేపు హైదరాబాద్ బోనాలు

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో పాతబస్తీలో ఆగస్టు 9వ తేదీన ఉదయం 6 గంటల నుంచి, 10వ తేదీన ఉదయం 9 గంటల నుంచి ఊరేగింపు ముగిసే వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని వెల్లడించారు. మదీనా ఎక్స్ రోడ్డు నుంచి ఇంజిన్ బౌలి (చార్మినార్, నాగుల్ చింతా మీదుగా) రహదారి బోనాల ఊరేగింపు పూర్తయ్యే వరకు పూర్తిస్థాయిలో ఈ రోడ్డును మూసివేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు వివరించారు. ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలకు చార్మినార్, ఫలక్‌నుమా వైపు నో ఎంట్రీ ఉంటుందని తెలిపారు. వాహనదారులను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించినట్లు వెల్లడించారు. కార్వాన్ దర్బార్ మైసమ్మ బోనాల సందర్భంగా ఆగస్టు 8వ తేదీ రాత్రి 9 గంటల నుంచి ఆగస్టు 10వ తేదీ ఉదయం వరకు పురానాపూల్, జియాగూడ, టప్పాచబుత్రా పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు పేర్కొన్నారు. అంబర్‌పేట్ మహంకాళి ఆలయం వద్ద ఆగస్టు 9వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ఆగస్టు 10వ తేదీ మధ్యాహ్నం 12గంటల వరకు మళ్లింపులు ఉంటాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. బస్సులు, భారీ వాహనాలు అంబర్‌పేట్ ÷÷-లఓల్గ÷వర్ మీదుగా వెళ్లాలని సూచించారు. చిలకలగూడ కట్ట మైసమ్మ ఆలయం వద్ద ఆగస్టు 9, 10వ తేదీల్లో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. సీతాఫల్‌మండి, పద్మారావు నగర్ వైపు వాహనాలను మళ్లిస్తున్నట్లు చెప్పారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# లోయలో పడ్డ బొలెరో వాహనం

## - ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు దుర్మరణం

**నైనిటాల్,మన జనప్రగతి ఆగస్టు 08:** ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బొలెరో వాహనం లోయలో పడ్డ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. శుక్రవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దేవ్‌ప్రయాగ్ నుంచి పౌరీ వెళుతున్న బొలెరో వాహనం శుక్రవారం సాయంత్రం సబ్దర్‌ఖల్ వద్ద ప్రమాదానికి గురైంది. రోడ్డు పక్క ఉన్న లోయలో పడిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే దేవ్‌ప్రయాగ్ పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో బొలెరోలో ఒకే కుటుంబానికి చెందిన 7 మంది ఉన్నారు. వాహనం లోయలో పడగానే తీవ్రగాయాలపాలై ఐదుగురు అక్కడికక్కడే చనిపోయారు. తీవ్రంగా గాయపడ్డ మరో ఇద్దరిని సహాయక సిబ్బంది దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు.

# 10న కలిదిండికి సిఎం చంద్రబాబు రాక

**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 08:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 10న ఏలూరు జిల్లా కలిదిండి మండలంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి కార్యక్రమంతో పాటు ప్రజా వేదిక, క్యాడర్ సమావేశాల్లో ఆయన పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించిన అధికారిక పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఆ రోజు ఉదయం 10:45 గంటలకి కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌కు హెలికాప్టర్‌లో సీఎం చంద్రబాబు చేరుకుంటారు. సీఎం చంద్రబాబుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలకనున్నారు. ఉదయం 11 గంటలకు కలిదిండి తహసీల్దార్ కార్యాలయానికి ఆయన చేరుకుంటారు. 11 గంటల నుంచి 11:45 వరకు రైతులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి నిర్వహిస్తారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కారాల దిశగా చర్యలు చేపడతారు. ఆ తర్వాత కలిదిండిలో ప్రజా వేదిక వద్దకు చేరుకుంటారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించనున్నారు. ఉదయం 11:55 నుంచి మధ్యాహ్నం 2:05 వరకు ప్రజా వేదిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. మధ్యాహ్నం 2:55 గంటలకు వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో పార్టీ శ్రేణులతో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహిస్తారు. 2:55 నుంచి సాయంత్రం 4:25 వరకు క్యాడర్ సమావేశంలో పాల్గొని వారికి దిశానిర్దేశర చేయనున్నారు. సాయంత్రం 4:35 గంటలకు కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌కు చేరుకుంటారు. అనంతరం 4:40 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 4:55 గంటలకు ఉండవల్లి నివాసానికి చేరుకోనున్నారు.

# 17 నుంచి ఎపి శాసనభ సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

మొదలు కానుంది. ఈ మేరకు ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ శనివారం నోటిఫికేషన్ విడుదల చేశారు. శాసనసభ, శాసనమండలి సెషన్ సమావేశానికి అధికారిక నోటిఫికేషన్ జారీ చేశారు. నాలుగు రోజుల పాటు 50వ వర్షాకాల సమావేశాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. 17వ తేదీ ఉదయం 9 గంటలకు ఏపీ అసెంబ్లీ సమావేశాలు మొదలవుతాయని నోటిఫికేషన్‌లో గవర్నర్ పేర్కొన్నారు. 17వ తేదీ ఉదయం 10 గంటలకు శాసన మండలి సమావేశాలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. 17వ తేదీ ఉదయం ఉభయ సభల బీఏసీలు సమావేశం కానున్నాయి. సమావేశాలు ఎన్ని రోజులు జరగాలి, అజెండాను ఉభయ సభల బీఏసీలు ఖరారు చేయనున్నాయి.

# వివేకా హత్యకేసు విచారణలో అవకతవకలు

(మొదటి పేజీ తరువాయి)

అవకతవకలు జరిగాయని ఆరోపించారు. శనివారం వైఎస్ వివేకా 75వ జయంతి సందర్భంగా పులివెందుల్లోని వివేకా సమాధి వద్ద కుమార్తె వైఎస్ సునీత కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. అనంతరం సునీత మీడియాతో మాట్లాడుతూ.. 'నా తండ్రి వివేక హత్య కేసు విషయంలో గత ఆరునెలల కాలంగా జడ్జిమెంట్లు కూడా సరిగా లేవని నా అభిప్రాయం.

విచారణలో అవకతవకలు ఉండడం వల్లే ఇన్నిసార్లు కోర్టుమెట్లు ఎక్కాల్సి వచ్చింది' అని చెప్పుకొచ్చారు. ఏదో ఒకరోజు న్యాయం జరుగుతుందనే నమ్మకంతో పోరాటం కొనసాగిస్తూనే ఉంటానని సునీత అన్నారు. వివేక హత్య జరిగిందని అందరికంటే ముందు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే తెలుసు అని సునీత పేర్కొన్నారు.


# మహిళా బిల్లుపై మాటల యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

షరతులు లేకుండా మద్దతివ్వాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. రిజిజు వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ వెంటనే స్పందించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును 2023లోనే పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిందని గుర్తుచేశారు. 'పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా మీకంటే ఈ విషయం బాగా ఎవరికి తెలుస్తుంది? మహిళా రిజర్వేషన్ చట్టం-2023 కాంగ్రెస్ పూర్తి మద్దతుతో ఏకగ్రీవంగా ఆమోదమైంది. అయినా మూడేళ్లు గడిచినా ఎందుకు అమలు చేయలేదు? ఇప్పుడు దాన్ని డీలిమిటేషన్‌తో అనవసరంగా ఎందుకు ముడిపెడుతున్నారు?' అని ప్రశ్నించారు. మహిళలకు రిజర్వేషన్ కల్పించే 2023 చట్టాన్ని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాహుల్ విడుదల చేసిన ఈ వీడియోలో మహిళల సామర్థ్యంపై విస్తృతంగా ప్రసంగించారు. దేశంలోని మహిళల శక్తి ఇంకా పూర్తిస్థాయిలో బయటకు రాలేదన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే మహిళలు తమ ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తం చేయాలని, తమకు నచ్చిన రంగాల్లో ముందుకు సాగేందుకు అవకాశం ఉండాలని పేర్కొన్నారు. మహిళలు.. వ్యాపారం, రాజకీయాల్లో రాణించడమే కాకుండా.. ఇళ్లలోనూ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పగలగాలని, సమాజంలో ఎలాంటి భయం లేకుండా తిరగగలగాలని చెప్పారు. పితృస్వామ్య భావజాలం, మహిళలపై ఉండే కఠిన నియంత్రణ నుంచి కొంత విముక్తి అవసరమని రాహుల్ అభిప్రాయపడ్డారు. మహిళా శక్తి, మహిళా రిజర్వేషన్ అంశాలపై రాహుల్ చేసిన వరుస వ్యాఖ్యల నేపథ్యంలో.. కేంద్రంతో కాంగ్రెస్ మధ్య రాజకీయ వాగ్వాదం మరోసారి తెరపైకి వచ్చింది.

# ఇకనుంచి స్మార్ట్ రేషన్ కార్డులు

## • 15 ఆగస్ట్‌న ప్రారంభించనున్న సిఎం




**నిజామాబాద్,మన జనప్రగతి ఆగస్టు 08:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి జిల్లా పౌర సరఫరాల శాఖ సన్నద్ధమవుతోంది. స్మార్ట్ కార్డు విషయంలో దాదాపు 8 నెలల నుంచి ప్రభుత్వం చేసిన ఆలోచన ఎట్టకేలకు కార్యరూపం దాల్చనుంది. ఆగస్ట్ 15న సంగారెడ్డిలో సిఎం వీటిని ప్రారంభిస్తారు. ఈ స్మార్ట్ కార్డులతో బోగస్ కార్డుల ఎత్తివేత సులువవుతందని భావిస్తున్నారు. జిల్లాల వారిగా స్మార్ట్ కార్డు పంపిణీ అంశంపై శ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పౌర సర ఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పౌరసరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ఆగస్టు 15 నుంచి స్మార్ట్ కార్డులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభిస్తారు. అదేరోజున మిగతా జిల్లాల్లో కూడా ప్రజా ప్రతినిధులు కార్డుల పంపిణీని లాంఛనంగా చేపడతారు. అయితే పంపిణీ వేదికలు, ఏర్పాట్లు తదితర అంశాలపై ఈనెల 11 వరకు స్పష్టత రానుంది. స్మార్ట్ రేషన్ కార్డు ఆకర్షణీయంగా ఉండనుంది. డ్రైవింగ్ లైసెన్స్, క్రెడిట్, డెబిట్ కార్డు సైజులో ఈజీగా వాలెట్‌లో పెట్టుకు నేలా ప్రభుత్వం రూపొందించింది. ఆధునిక సాంకేతిక విలువాలతో కార్డు ఆకర్షణీయంగా ఉంటుందని అధికా రులు అంటున్నారు. కొత్త కార్డుల దరఖాస్తు నిరంతర పక్రియ కావడంతో కార్డుల సంఖ్య పెరుగుతూనే ఉంటుంది. నిజామాబాద్ జిల్లాలో ప్రస్తుతం ఉన్న కార్డుల స్థానే కొత్త కార్డులను అందిస్తారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లా అధికారులు జాబితాను సిద్ధం చేశారు.

# మోదీ విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న నిరసన



**దేవనకొండ మన జనప్రగతి ఆగస్టు 08:-** కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న నిర్వహించే జైల్‌భరో, నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి. వీరశేఖర్, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఎం. నరసరావు పిలుపునిచ్చారు.దేవనకొండలో శనివారం జరిగిన కార్మిక సంఘాల సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికులకు రూ.31 వేల కనీస వేతనం అమలు చేయాలని, లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.అన్ని పంటలకు మద్దతు ధర కల్పించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు ఇవ్వాలని, కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతుల రుణాలు మాఫీ చేసి ఉచిత పంటల బీమా అమలు చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకం కింద 200 రోజుల పని, రోజుకు రూ.700 వేతనం ఇవ్వాలని, పట్టణ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు.కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతుల రుణాలు మాఫీ చేయాలని, వేదవతి, గుండ్రేవుల రిజర్వాయర్లను పూర్తి చేయాలని కోరారు. ఆగస్టు 10న నియోజకవర్గ కేంద్రాల్లో జరిగే నిరసన కార్యక్రమాలకు కార్మికులు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని నాయకులు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో వివిధ కార్మిక, రైతు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# బెంగళూరులో ఘనంగా అఖిలభారత ఓబీసీ 11వ మహాసభ



**బెంగళూరు,మన జనప్రగతి ఆగస్టు 08:-** బీసీలకు జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని అఖిలభారత ఓబీసీ 11వ మహాసభ డిమాండ్ చేసింది. బెంగళూరులో జరిగిన ఈ మహాసభకు 29 రాష్ట్రాల నుంచి ఓబీసీ ప్రతినిధులు హాజరయ్యారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర జేఏసీ కన్వీనర్ రాయల్ బాబు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సమగ్ర కుల జనగణన నిర్వహించి బీసీల వాస్తవ జనాభా, సామాజిక పరిస్థితులపై స్పష్టమైన గణాంకాలు సేకరించాలని కోరారు.జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు ప్రత్యేక సబ్‌కోటా ఇవ్వాలని, మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలను ఏ, బీ, సీ, డీ వర్గాలుగా వర్గీకరించి రిజర్వేషన్ల ప్రయోజనాలు అన్ని వర్గాలకు సమానంగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని తొలగించి జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో బీసీలకు న్యాయమైన వాటా కల్పించాలని రాయల్ బాబు అన్నారు. బీసీల హక్కులు, సామాజిక న్యాయం కోసం దేశవ్యాప్తంగా ఓబీసీ సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని మహాసభలో ప్రతినిధులు పిలుపునిచ్చారు.

# ఆదోని డీఎస్పీ వెంకటరమణకు బీసీ ఫెడరేషన్ సన్మానం



**ఆదోని, మన జనప్రగతి, ఆగస్టు 08:-** ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ వెంకటరమణను ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు ఆధ్వర్యంలో బీసీ నాయకులు డీఎస్పీని కలిసి పట్టణంలోని ట్రాఫిక్ సమస్యలను వివరించారు.పీఎన్ రోడ్డు, ఎంఎం రోడ్డులో వన్‌వే ట్రాఫిక్ అమలు, ఫుట్‌పాత్‌లపై ద్విచక్ర వాహనాల పార్కింగ్, మార్కెట్ ప్రాంతాల్లో ఆటోల నిలుపుదల, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద పర్యవేక్షణ పెంచాలని, అధిక వెలుతురు ఇచ్చే ఎల్ఈడీ లైట్లు, సైలెన్సర్లు లేకుండా రాత్రివేళ బైకులు నడిపే వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో పి. సాయిబాబా, కత్తి హనుమంతరావు, హరికృష్ణ, దేవిశెట్టి ప్రకాష్, కపటి వీరభద్ర, బోయ మల్లేశ్వరప్ప, గొల్ల నరసింహులు, తోన్పే తాయప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కూటమి ప్రభుత్వం

**- రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ**



**దేవనకొండ మన జనప్రగతి ఆగస్టు 08 :-** ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా క్షేత్రస్థాయిలో పనిచేయడమే 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ అన్నారు.దేవనకొండ మండలం పి. కోటకొండ గ్రామంలో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు కుటుంబాలను నేరుగా కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. ప్రజల నుంచి స్థానిక సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.మహిళలు, రైతులు యువత, వృద్ధులు, పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సూపర్ సిక్స్ పథకాల అమలుతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ప్రజల సమస్యలను వినడం మాత్రమే కాకుండావాటి పరిష్కారం కోసం నిరంతరం అందుబాటులో ఉండటమే ప్రజా ప్రతినిధుల బాధ్యత అని బొజ్జమ్మ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడు కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# క్విట్‌ఇండియాఉద్యమస్ఫూర్తితో ఈ నెల 10న జైలు బరో

**• కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం పార్టీ నాయకులు.**



**పత్తికొండ మన జనప్రగతి ఆగస్టు 08:-** క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో ఈనెల 10వ తారీఖున జైలు భరో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సిపిఎం పార్టీ నాయకులు తెలిపారు. శనివారం పత్తికొండ పట్టణంలో జైలు భరో కరపత్రాలను సిఐటియు మండల కార్యదర్శి ఎశి.రవిచంద్ర ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో జూలై 28 29 తేదీల్లో జరిగిన సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల జాతీయ సదస్సు లో నేడు కార్మికులు రైతాంగం సామాన్య ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఆగస్టు 10 నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పిలుపులో భాగంగా పత్తికొండలో కూడా పదో తారీఖున జైలు బరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన తెలిపారు. జూలై నెలలో మోడీ ప్రభుత్వానికి ముక్కుతాడు వేసిన విద్యార్థి యువత ఉద్యమం మనకు స్ఫూర్తిదాయకంగా కావాలని ఆయన తెలిపారు. అందులో భాగంగా అన్ని కార్మిక రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు ఐక్యతతో ఈ జైలు బరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జైల్ బరో కార్యక్రమంలో అమెరికా స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని లేబర్ కోడ్లను రద్దు చేయాలని కనీస వేతనం 31 వేలు ఇవ్వాలని అంగన్వాడీలు ఆశ మిడ్ డే వివో ఏ సమగ్ర శిక్ష ఎన్.హెచ్.ఎం తదితర స్కీం వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కౌలు రైతులకు పంట రుణమాఫీ చేయాలని అన్నారు పత్తికొండ హంద్రీనీవా కాలవ ద్వారా పత్తికొండ మండలంలో ఉన్న ప్రతి ఎకరాకి పిల్ల కాలువలు ద్వారా నీళ్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పత్తికొండ పట్టణానికి ఎంతో అవసరమైన రోడ్డు విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టాలని ఆయన అన్నారు. జైల్ బరో కార్యక్రమంలో అన్ని డిమాండ్లతో కూడిన ప్రసంగం జిల్లా నాయకులు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు కాశన్న సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు కాసిం సిపిఎం మండల కమిటీ సభ్యులు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# కువైట్‌లో ఘనంగా ఏపియన్ ఆర్‌టిఎస్ అభినందన సభ






**కువైట్ / రాయచోటి మన జనప్రగతి ఆగస్టు 07:-** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మిడిల్ ఈస్ట్ మరియు ఫార్ ఈస్ట్ ప్రత్యేక ప్రతినిధిగా రావి రాధాకృష్ణ ను నియమించిన సందర్భంగా, ఏ పి యన్ ఆర్ టి ఎస్ మరియు యన్ ఆర్ ఐ తెలుగుదేశం పార్టీ కువైట్ సంయుక్త ఆధ్వర్యంలో ద్వైహి స్థలం, కువైట్ లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆ సంస్థ కోఆర్డినేటర్లు, నూతనంగా నియమితులైన రీజినల్ కోఆర్డినేటర్లు, యన్ ఆర్ ఐ తెలుగుదేశం పార్టీ నాయకులు, తెలుగు సంఘాల ప్రతినిధులు, మహిళా, యువ నాయకులు, వివిధ సామాజిక సంస్థల ప్రతినిధులు, ప్రవాస తెలుగు కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.సమావేశం ప్రారంభంలో నూతనంగా నియమితులైన సంస్థ కోఆర్డినేటర్లతో సీనియర్ నాయకులు దరూరి బలరామ నాయుడు ప్రతిజ్ఞ చేయించారు. ప్రవాసాంధ్రుల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా తీసుకొని సేవాభావం, క్రమశిక్షణ, సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కోడూరు నియోజకవర్గం సీనియర్ నాయకులు, తెలుగుదేశం పార్టీ బీసీ విభాగ అధ్యక్షులు స్వర్గీయటి గుండాల యాదవ్ ఇటీవల పరమపదించిన సందర్భంగా సభ రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఘన నివాళులర్పించింది. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు. అనంతరం రావి రాధాకృష్ణకు ఘన స్వాగతం అధికారిక కార్యక్రమాల కారణంగా జూమ్ ద్వారా వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్న రావి రాధాకృష్ణ కు సభికులు ఘన స్వాగతం పలికారు. ఆయన సమావేశంలో చేరగానే సభికులు లేచి నిలబడి స్టాండింగ్ ఓవేషన్ ద్వారా తమ గౌరవం, అభిమానాన్ని తెలియజేశారు.గల్ఫ్ దేశాల్లో ఎన్నో సంవత్సరాలుగా ప్రవాసాంధ్రుల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన సేవలను పలువురు నాయకులు గుర్తుచేశారు. ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటూ, సమస్య వచ్చినప్పుడు వెంటనే స్పందించే సేవా నాయకుడిగా ఆయనను కొనియాడారు.అభినందనలకు స్పందించిన రావి రాధాకృష్ణ కు, తనకు లభించిన గౌరవాన్ని వ్యక్తిగత గౌరవంగా కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాసాంధ్రుల ప్రేమగా భావిస్తున్నానని తెలిపారు."ప్రవాసాంధ్రుల సంక్షేమమే నా మొదటి ప్రాధాన్యత" అని స్పష్టం చేస్తూ, "మీ సమస్యలు ఏమిటి? మీ సేవలను ఇంకా ఎలా మెరుగుపరచాలి?" అంటూ నాయకులు, కోఆర్డినేటర్ల నుంచి సూచనలు కోరారు. సమావేశంలో వచ్చిన ప్రతి సూచనను లిఖితపూర్వకంగా పంపించాలని కోరారు. అనంతరం సంస్థ భవిష్యత్ కార్యాచరణపై కీలక చర్చ అభినందనల అనంతరం సమావేశం సంస్థ తన సేవల విస్తరణ, ప్రవాసాంధ్రుల సంక్షేమం, డిజిటల్ సభ్యత్వం, అత్యవసర సహాయం, స్కిల్ డెవలప్‌మెంట్, మహిళల భద్రత, తెలుగు సంఘాలతో సమన్వయం, యువత భాగస్వామ్యం, గల్ఫ్ దేశాల్లో సేవల విస్తరణ తదితర అంశాలపై నిర్మాణాత్మక చర్చకు వేదికగా మారింది.ఏ పి యన్ ఆర్ ఆర్ టి ఎస్ డైరెక్టర్ అక్కిలి నాగేంద్రబాబు మాట్లాడుతూ, ప్రవాసాంధ్రుల సమస్యల పరిష్కారానికి సంస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు మహిళల గౌరవం, సోషల్ మీడియా బాధ్యతాయుత వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ములకలసుబ్బారాయుడు సమిష్టి కృషి, పరస్పర సమన్వయంతోనే సంస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొంటూ, అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

# వివేకా హత్య కేసు దర్యాప్తులో అవకతవకలు జరిగాయి

**న్యాయం కోసం నా పోరాటం కొనసాగిస్తా...**

**రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు లేఖ రాసిన: వైఎస్ సునీత**



**పులివెందుల మన జనప్రగతి ఆగస్టు 08:-** మాజీ వైయస్ వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తులో అవకతవకలు జరిగాయని, న్యాయం కోసం నా పోరాటం కొనసాగిస్తానని వివేకా కుమార్తె వైయస్ సునీతా రెడ్డి తెలిపారు. శనివారం వైఎస్ వివేకా 75 వ జన్మదిన సందర్భంగా ఆయన సమాధి వద్ద సునీత, భర్త రాజశేఖర్ రెడ్డి, కుటుంబ సభ్యులు లు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వైఎస్ వివేకా ఇంటి సమీపంలోని పార్కులోని వైఎస్ వివేకా విగ్రహానికి పూలమాల వేసి జన్మదిన కేక్ ను కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూవివేక హత్య జరిగి ఏడున్నర సంవత్సరాలు అయినా న్యాయం జరగలేదన్నారు.గత ఆరు నెలల్లో వచ్చిన కొన్ని తీర్పులు సంతృప్తికరంగా లేవన్నారు.కిరణ్ యాదవ్ ఒక మాట ఆయన తల్లి ఒక మాట పొంతన లేని సమాధానాలు చెబుతూ గందరగోళానికి సృష్టిస్తున్నారన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డికి ప్రజలకు తెలియక ముందే వివేక హత్య జరిగినట్టు సమాచారం అందింది అన్నారు. ఏదో ఒక రోజు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. **నా ఆస్తిని పరిరక్షించండి ఆర్డిఓ ను డిఎస్పిని కోరిన వైఎస్ సునీత** పులివెందుల పట్టణ పరిధిలో ఉన్న తమ ఆస్తిని పరిరక్షించాలని స్థానిక ఆర్డిఓ చిన్నయ్య, పులివెందుల డిఎస్పి మురళి నాయక్ ను కోరారు. శనివారం స్థానిక ఆర్డిఓ, డి.ఎస్.పి కార్యాలయాలకు తన భర్త రాజశేఖర్ రెడ్డి తో కలిసి వెళ్లారు. సుదీర్ఘంగా వారితో తమ ఆస్తి విషయంలో కొంతమంది దౌర్జన్యం చేస్తున్నారని వారి నుంచి ఆస్తిని కాపాడాలని కోరినట్టు తెలుస్తుంది. **రాష్ట్రపతికి వైయస్ సునీతా లేఖ** మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. తమకు న్యాయం చేయాలని కోరుతూ ఆయన కుమార్తె సునీత.. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు లేఖ రాశారు. తన తండ్రి హత్య జరిగి ఏడేళ్లు పూర్తయినా ఇప్పటికీ తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీబీఐ దర్యాప్తు, అనంతరం పరిణామాలను రాష్ట్రపతికి వివరించారు. ఇప్పటికీ పరిశీలించని కొన్ని అంశాలను సైతం రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లానని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రపతికి రాసిన లేఖను సునీత ప్రధాని, హోంశాఖ, న్యాయ శాఖలతో పాటు కేబినెట్, సీబీఐ డైరెక్టర్, తెలుగు రాష్ట్రాల గవర్నర్లు, సీఎంలకు పంపారు. కోర్టుల్లో ఉన్న పెండింగ్ విషయాలపై జోక్యం కోరడం లేదని.దర్యాప్తులో బయటకు రాని కీలక విషయాలు వెలుగులోకి రావాల్సి ఉందన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలి

**• డీసీసీ సెక్రటరీ సయ్యద్ జమాలుద్దీన్**



**కరీంనగర్,మన జనప్రగతి ఆగస్టు 08 :-** జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని డీసీసీ సెక్రటరీ సయ్యద్ జమాలుద్దీన్ అన్నారు. కరీంనగర్‌లో ప్రస్తుతం పార్టీ బలహీనంగా ఉందని, పార్టీ పదవుల కోసం పోటీ పడుతున్న నాయకులు పార్టీ బలోపేతంపై కూడా దృష్టి సారించాలని సూచించారు.రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావాలంటే నాయకులు, కార్యకర్తలు ప్రజలకు మరింత చేరువ కావాలని కోరారు. కనీసం నెలకు ఒకసారి సమావేశాలు నిర్వహించి పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో పార్టీకి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. తాను డీసీసీ సెక్రటరీగా మాత్రమే కాకుండా సామాజిక కార్యకర్తగా ప్రజల్లో ఉంటూ పరిస్థితులను గమనిస్తున్నానని తెలిపారు. ఇప్పటికైనా సమయం ఉన్నందున నాయకులు ప్రజలతో కలిసి విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని సయ్యద్ జమాలుద్దీన్ విజ్ఞప్తి చేశారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
09- 08 - 2026



## తల్లికి వందనం ఒకే కుటుంబంలో 8 మందికి లబ్ది

**ఆలూరు మన జనప్రగతి ఆగస్టు 08 :** ఆలూరు నియోజకవర్గం కురువల్లి గ్రామంలో ఒకే కుటుంబంలో 8 మంది పిల్లలకి, తల్లికి వందనం కింద 13000/- చోపున 8 మందికి 1 లక్ష 4 వేలు రూపాయలు లబ్ధి పొందారు. వారి కుటుంబాన్ని సందర్శించి విద్యార్థులు భావి భవిష్యత్తులో ఉన్నత శిఖరాన్ని ఎదగాలని ఆలూరు నియోజకవర్గం ఇన్చార్జి వైకుంఠం జ్యోతి సందర్శించి విద్యార్థుల బావి భవిష్యత్తు కోరింది. గత ప్రభుత్వం ఒకరికే పరిమితమైతే మా ప్రభుత్వం ఎంత మంది చదివితే అంత మందికి తల్లికి వందనము అందిస్తూ విద్యకు ఎవరు దూరం కాకుండా అందరూ చదవాలని కాంక్షతో మా ప్రభుత్వం ముందుకు వెళుతుంది . ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బి మల్లయ్య తలారి వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



**సిద్ధవటం, మన జనప్రగతి, ఆగస్టు 08:-** మాదక ద్రవ్యాలు, మద్యపానానికి ప్రజలు దూరంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎక్సైజ్ శాఖ పరిధిలోని సిద్ధవటం, అట్లూరు, ఒంటిమిట్ట మండలాల గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి నెల రెండో, నాలుగో శనివారాల్లో పీఏఆర్ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. శనివారం సిద్ధవటంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. మద్యపానం, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే స్వల్పకాలిక, దీర్ఘకాలిక మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. యువత మాదక ద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా వాటి దుష్ప్రభావాలపై చైతన్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్నట్లు తెలిసినట్లయితే ఎక్సైజ్ శాఖకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తీసుకొచ్చి అక్రమంగా విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నారాయణ, ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో విశేష పూజలు



**సిద్ధవటం, మన జనప్రగతి, ఆగస్టు 08:-** మండలంలోని కడపచెన్నై జాతీయ రహదారి పక్కన జేఎంజే కళాశాల సమీపంలో వెలసిన శ్రీ లక్ష్మీదేవి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారి, అమ్మవార్ల విగ్రహాలకు విశేష పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నరసింహస్వామి ఆధ్వర్యంలో గణపతి పూజ, కుంకుమార్చన, అభిషేకం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి దర్శనం కోసం కడప, ఒంటిమిట్ట, భాకరాపేట తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

## కటికరెడ్డి రామచంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు

**సింహాద్రిపురం మన జనప్రగతి ఆగస్టు 03:-** మండలం కసునూరు గ్రామానికి చెందిన ఆదర్శ రైతు స్వర్గీయ కటికరెడ్డి రామచంద్రారెడ్డి ఆరవ వర్ధంతి సందర్భంగా కటికరెడ్డి బ్రదర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పులివెందులలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.కుటుంబ సభ్యులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు, జానపద కళాకారుడు రేలా రేలా నాగరాజుకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. దివ్యాంగులు కటికరెడ్డి లక్ష్మీదేవమ్మ, రామగిరి జనార్ధన్‌రెడ్డిని శాలువాలతో సత్కరించి, దివ్యాంగులకు అన్నదానం నిర్వహించారు.కటికరెడ్డి కుటుంబ సభ్యుల సేవాభావం అభినందనీయమని ప్రముఖ స్వచ్ఛంద సేవకులు నక్కలపల్లె కొండారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, దివ్యాంగుల నెట్‌వర్క్ ప్రతినిధులు, స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా పగటి వేషాలను జెంజి యువత నిశితంగా గమనిస్తున్నారు: డాక్టర్ జీలాన్



**కడప మన జనప్రగతి ఆగస్టు 08:-**వైఎస్ఆర్ పార్టీ చేసే పగటి వేషాలను జంజి యువత, ప్రజలు ,విద్యార్థులు నిశితంగా పరిశీలిస్తున్నారని తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి జులాన్ భాష తెలిపారు. ఈ సందర్భంగా శనివారం వైయస్సారు ప్రెస్ క్లబ్ నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూతమ బాధ్యతలను నిర్వర్తించని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి ఇది 'జెన్-జీ' యువత డిమాండ్ అన్నారు.యువకుల పట్ల భస్మాసుర హస్తంలా గత 5 సంవత్సరాలు వ్యవహరించిన వైస్సార్సీపీ పార్టీ ,కూటమి ప్రభుత్వం పైన విమర్శించే నైతిక హక్కు లేదు తెలిపారు . టీడీపీ ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ఆరోపణలు అమోదయోగ్యం కాదు. తమ ఉనికి కోసం వైఎస్సార్‌సీపీ తప్పుడు ఆరోపణలు చేస్తోంది అన్నారు. ఇది చాలా సిగ్గుచేటు, మేము దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాము అని తెలిపారు టిడిపి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా మరియు జవాబుదారీతనంతో పనిచేస్తోంది. యువత ఆశయాలు టిడిపి పాలనలోనే నెరవేరుతాయి. డీఎస్సీ ప్రక్రియ పైన అసత్య ఆరోపణలు చేయడం శోచనీయం . ఆధారాలు ఉంటె న్యాయస్థానాలను ఆశ్రయించకుండా రోడ్ల పై చౌకబారు రాజకీయాలు చేయడం వైకాపా దిగజారుడు వ్యవహారాలకు నిదర్శనం అన్నారు . క్రీడాకారులకు దివ్యాంగులకు అణగారిన వర్గాలకు సమ న్యాయం చేసి ఉద్యోగ ఉపాధి కల్పన చేయడం కూటమి ప్రభుత్వ సుపరిపాలనకు నిదర్శనం తెలిపారు ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్ జిలాని పాలగిరి రసూల్ తదితరులు పాల్గొన్నారు .

## లింగాపురం సొసైటీలో ఎరువుల పంపిణీ ప్రారంభం



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 08:-** రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రొద్దుటూరు మండలం లింగాపురం పీఏసీఎస్ ఆధ్వర్యంలో యూరియా, డీఏపీతో పాటు రాయితీపై లభించే ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ప్రారంభించారు.లింగాపురం పీఏసీఎస్ ద్వారా డి బి టి, ఏ పి ఏ ఐ ఎం ఎస్ 2.0 విధానాల ద్వారా మండలంలోని రైతులకు ఎరువులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతుల ప్రయోజనం కోసం రూపొందించిన 'రైతులారా మీకోసం ఎల్‌నినో ప్రభావ నివారణ' కరపత్రాలను ఎమ్మెల్యే విడుదల చేశారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా అవసరమైన మేరకు అందుబాటులో ఉంచాలని, పంపిణీలో పారదర్శకత పాటించాలని అధికారులు, సొసైటీ నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, లింగాపురం సొసైటీ చైర్మన్ సిద్ధారెడ్డి నాగముని రెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త బసిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామి రెడ్డి, ఏఓ వరహరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు పరిష్కరిస్తాం

**- అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు: ఎమ్మెల్యే**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 08:-** ప్రజల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి అన్నారు. శనివారం లింగాపురంలో నిర్వహించిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామాల్లో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకురాలు కొండవీటి భావన, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, లింగాపురం సొసైటీ చైర్మన్ సిద్ధారెడ్డి నాగమునిరెడ్డి, బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాల్లో భోజన నాణ్యతపై వైద్య సిబ్బంది తనిఖీలు



**సిద్ధవటం, మన జనప్రగతి, ఆగస్టు 08:-** మండల కేంద్రమైన సిద్ధవటంలోని బీసీ, ఎస్సీ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థినీ, విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను వైద్య సిబ్బంది శనివారం తనిఖీ చేశారు. పి.కొత్తపల్లి వైద్యాధికారి డాక్టర్ మురళీమోహన్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని, వంట గదులను పరిశుభ్రంగా ఉంచాలని హాస్టల్ సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. భోజనం చేసే ముందు విద్యార్థులు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. కీటక జనిత వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రక్తహీనత నివారణకు ఆకుకూరలు, గుడ్లు వంటి పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. రాత్రి వేళల్లో దోమల కాటుకు గురికాకుండా పూర్తిగా శరీరాన్ని కప్పే దుస్తులు ధరించాలని, వసతి గృహాల పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు శారద, శంకరయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు మౌలాలి, శారదాదేవి, ఆశా వర్కర్ ఓబులమ్మ, విద్యార్థినీ, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరులో మూడో రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

- డీఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణకు డిమాండ్
- దీక్షలో పాల్గొన్న మహిళా నేతలు, డీఎస్సీ అభ్యర్థులు




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 08**:డీఎస్సీ లో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలని, నిరుద్యోగ భృతి తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయం ప్రధాన గేటు ఎదుట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. మూడో రోజు దీక్షలో నియోజకవర్గానికి చెందిన పలువురు మహిళా నేతలు, డీఎస్సీ అభ్యర్థులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. డీఎస్సీ అభ్యర్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు హాజరై దీక్షకు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని నాయకులు పేర్కొన్నారు.

## కడప కార్పొరేషన్‌లో కాంగ్రెస్‌కు గెలుపు ఖాయం



**కడప మన జనప్రగతి ఆగస్టు 08:-**కడప కార్పొరేషన్ లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ఆ పార్టీ నగర అధ్యక్షులు సయ్యద్ గౌస్ పీర్ పేర్కొన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 3వ విడత ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమాన్ని డిసిసి అధ్యక్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి జెండా ఊపి ప్రారంభించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి పార్టీ విధానాలు, ప్రజా సమస్యలు, భవిష్యత్ కార్యాచరణను వివరించారు.ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి, నగర అధ్యక్షులు సయ్యద్ గౌస్ పీర్ మీడియాతో మాట్లాడుతూ ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ పెరుగుతోందని పేర్కొన్నారు. రాబోయే కడప కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కనీసం 30 డివిజన్లలో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల మధ్యే ఉంటుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు ప్రజలకు అందించే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తున్నారని చెప్పారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ఇప్పటి నుంచే పటిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. కలసికట్టుగా పార్టీ కోసం పని చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. జర్నలిస్టుల సంక్షేమానికి తాము కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం పిసిసి అధ్యక్షులు షర్మిల నాయకత్వంలో తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో కడప నియోజకవర్గ కో ఆర్డినేటర్ బండి జకరయ్య.అంజన్ కుమార్ అఖిల్, మామిళ్ళ బాబు,సుభాన్ దాసరి శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, కోటపాటి లక్ష్మయ్య , సుశీల్ కుమార్, జవహర్ బాల్ మంచ్ జిల్లా అధ్యక్షులు పుల్లూరు బాష, సుధాకర్, శామీర్ హుస్సేన్,జాబీర్ అలీ, సిద్ధిక్, గఫార్, సుబ్రహ్మణ్యం, మహబూబ్ బాషా, సాదిక్, తదితరులు పాల్గొన్నారు.

## చెన్నూరుప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలకు ప్రజల నుంచి విశేష స్పందన

**ప్రజలకు అందుబాటులో అన్ని రకాల మందులు**

**ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల నూతన భవనం**

**చెన్నూరు,మన జనప్రగతి ఆగస్టు 08:-**మండల కేంద్రమైన చెన్నూరులో సామాజిక ఆరోగ్య కేంద్రం లో నడుస్తున్న ఆయుష్ శాఖ అనుబంధంగా నడుస్తున్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నది, రాష్ట్ర ప్రభుత్వం రోగులకు అందుబాటులో అన్ని రకాల ఆయుర్వేద మందులను అందుబాటులో ఉంచారు, 30 లక్షల ఖర్చుతో నూతన భవనాన్ని నిర్మించారు, ఈ భవనంలో ఓపి గది మందుల గది డాక్టర్ సిబ్బంది రోగులు వేచి ఉండడానికి తగినట్టుగా భవనాన్ని నిర్మించారు, ఈ భవనం అన్ని అంగులతో పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉంది, ఆయుర్వేదం, హోమియోపతి, యునాని ,నా చిరుపతి, అన్ని శాఖలను ఆయుష్ శాఖ గా మార్పు చేసింది, ఈ విషయంపై ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ .టి . రవికుమార్ శనివారం మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో మంచి ఆయుర్వేద మందులు ఉన్నాయని తెలిపారు, పక్షవాతం కీళ్ల నొప్పులు చర్మ వ్యాధులు నరాల బలహీనత మహిళలకు సంబంధించిన అన్ని రకాల ఆయుర్వేద మందులు ఉన్నాయన్నారు, ఆయుర్వేదం బలోపేతం చేసేందుకు చెన్నూరు మండలంలో గోపవరం బుడ్డాయిపల్లి కొండపేట కనుపర్తి వివిధ గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు, ప్రజలు కావలసిన అన్ని మందులు వైద్యశాలలో అందుబాటులో ఉన్నాయన్నారు, త్వరలోనే నూతన ఆయుర్వేద భవనాన్ని ప్రజాప్రతినిధులు చేతులు మీదుగా ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందన్నారు,ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు,






# నెల్లూరులో రాత్రివేళ బైకుల తనిఖీలు

**• ట్రాఫిక్ కానిస్టేబుల్ దురుసు ప్రవర్తనపై ఆరోపణలు**



**నెల్లూరు మన జనప్రగతి ఆగస్టు 08:-** నగరంలో రాత్రి వేళ ట్రాఫిక్ పోలీసులు నిర్వహిస్తున్న ద్విచక్ర వాహనాల తనిఖీలపై వాహనదారుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా బైకులను ఆపి తనిఖీలు చేసే సమయంలో ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ వాహనదారులతో అసభ్యకరమైన భాషలో మాట్లాడుతున్నారనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. రాత్రి సమయంలో విధులు నిర్వహించే పోలీసులు ట్రాఫిక్ నిబంధనలను అమలు చేయడం స్వాగతించదగిన విషయమే అయినప్పటికీ, వాహనదారులతో గౌరవంగా వ్యవహరించాల్సిన బాధ్యత కూడా పోలీసులపై ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లయితే చట్ట ప్రకారం జరిమానా విధించాలి కానీ, దుర్భాషలాడటం లేదా అవమానకరంగా మాట్లాడటం సమంజసం కాదని వాహనదారులు పేర్కొంటున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు, ప్రత్యక్ష సాక్షుల వివరాలు లేదా ఫిర్యాదులు ఉంటే వాటిని పరిశీలించి ఉన్నతాధికారులు వాస్తవాలను నిర్ధారించాలని ప్రజలు కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు వాస్తవం కాదని తేలితే విషయాన్ని స్పష్టంగా ప్రజలకు తెలియజేయాలని వారు కోరుతున్నారు. రాత్రివేళ ట్రాఫిక్ తనిఖీలు ప్రజల భద్రత కోసం ఉండాలి.. భయపెట్టేందుకు కాదు అనే అభిప్రాయం నగర ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారంపై నెల్లూరు ట్రాఫిక్ ఉన్నతాధికారులు స్పందించి స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

# సాగు వ్యూహం మార్చి పంట నష్టాలను అధిగమిద్దాం: మంత్రి దుర్గేష్



**గుంటూరు,మన జనప్రగతి ఆగస్టు 08:-** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ సాగు విధానాలపై దృష్టి సారించాలని గుంటూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. గుంటూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సాధారణ వర్షపాతంలో ఇప్పటివరకు 42 శాతం మాత్రమే నమోదైందని మంత్రి తెలిపారు. నీటి లభ్యత తక్కువగా ఉన్నందున వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే వాణిజ్య, అంతర పంటలను సాగు చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిలో తొలి ప్రాధాన్యత తాగునీటికే ఇస్తామని, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ప్రత్యామ్నాయ సాగుపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' ద్వారా రైతులకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. చేనేత కార్మికులకు ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సాయం, చేనేతలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. పొగాకు రైతులకు మద్దతు ధరతో పాటు వడ్డీ లేని రుణాలు, ప్రైస్ డిఫరెన్స్ కాంపెన్సేషన్ కల్పిస్తున్నామని తెలిపారు. మాజీ సీఎం జగన్ పర్యటనలు రైతు సమస్యల పరిష్కారం కోసం కాకుండా రాజకీయ ప్రయోజనాల కోసమేనని మంత్రి విమర్శించారు. గత ఐదేళ్లలో రైతులకు మేలు చేయని వైసీపీకి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. యువతకు ఉద్యోగాల కల్పనలో భాగంగా 16 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తి చేశామని, అక్టోబర్‌లో మరో డీఎస్సీ నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. మీడియా సమావేశంలో జనసేన నాయకులు గాదె వెంకటేశ్వరరావు, బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, చందు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**- గరుడసేవ రోజు భక్తుల సురక్షిత నిష్క్రమణపై క్షేత్రస్థాయి పరిశీలన**



**తిరుమల, మన జనప్రగతి ఆగస్టు 08:-** శ్రీవారి బ్రహ్మోత్సవాలు2026ను దృష్టిలో ఉంచుకుని తిరుమలలో భక్తుల భద్రత, రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, బందోబస్తు ఏర్పాట్లను పటిష్టం చేస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ఇందులో భాగంగా తిరుమల డీఎస్పీ, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారులు, తిరుమల 2 టౌన్ సీఐ, ఏవీఎస్‌వో, విజిలెన్స్ సిబ్బందితో కలిసి శనివారం తిరుమలలోని కీలక ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గరుడసేవ రోజు భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున, భక్తుల రాకపోకలు సజావుగా సాగడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో వారిని సురక్షితంగా బయటకు తరలించేలా నిష్క్రమణ ప్రణాళికపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. లేపాక్షి సర్కిల్, ఎస్‌వీ షాపింగ్ కాంప్లెక్స్, ఎస్ఎంసీ, సుపథం, రాగిమాను జంక్షన్ ప్రాంతాలను పరిశీలించి రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, బందోబస్తు, ప్రవేశనిష్క్రమణ మార్గాలు, అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా పోలీసు, విజిలెన్స్ విభాగాలు సమన్వయంతో పనిచేసేలా ముందస్తు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించిన అంశాలపై సంయుక్త సమావేశం నిర్వహించి తదుపరి భద్రతా చర్యలను ఖరారు చేయనున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రద్దీ, ట్రాఫిక్ నియంత్రణతో పాటు అత్యవసర పరిస్థితుల నిర్వహణకు సమగ్ర ప్రణాళిక అమలు చేస్తామని తెలిపారు.

# 2029 నాటికి వైసీపీ గ్రాఫ్ జీరోకు పడిపోవడం ఖాయం: మంత్రి నారాయణ



**నెల్లూరు,మన జనప్రగతి ఆగస్టు 08:-** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నెల్లూరు నగరంలోని 15, 8, 10 డివిజన్లలో అధికారులతో కలిసి పర్యటించారు. స్థానికులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్వేపల్లి కాలువకట్ట ప్రాంత ప్రజల సమస్యలపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. దశాబ్దాలుగా అక్కడ నివసిస్తున్న వారిని ఇబ్బందులకు గురిచేయబోమని, ఎన్జీటీ నిబంధనలకు అనుగుణంగా సర్వే నిర్వహించి అర్హులకు శాశ్వత ఇంటిపట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వానికి వస్తున్న ఆదరణను చూసి వైసీపీ ఓర్వలేకపోతోందని విమర్శించారు. మెగా డీఎస్సీపై అనవసర రాద్ధాంతం చేస్తూ 16 వేల మంది ఉపాధ్యాయుల సంతోషాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వంపై ప్రజల ఆదరణ ఇలాగే కొనసాగితే, వైసీపీ నాయకుల తీరు మారకపోతే లి2029 నాటికి వైసీపీ గ్రాఫ్ జీరోకు పడిపోవడం ఖాయమనిలి మంత్రి నారాయణ అన్నారు. ఈ పర్యటనలో మేయర్ దేవరకొండ సుజాత, కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# కళాకారుల ప్రతిభను విశ్వవ్యాప్తం చేసే వేదిక 'అమరావతి చిత్రకళా వీధి': మంత్రి దుర్గేష్



**గుంటూరు,మన జనప్రగతి ఆగస్టు 08:-** కళాకారుల సృజనాత్మకతను ప్రపంచానికి చాటిచెప్పే అద్భుత వేదికగా 'అమరావతి చిత్రకళా వీధి' నిలుస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గుంటూరులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన 'అమరావతి చిత్రకళా వీధి' ఉత్సవంలో మంత్రి కీలకోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాకారుల ప్రతిభ గతంలో ఆర్ట్ గ్యాలరీల నాలుగు గోడలకే పరిమితమయ్యేదని, కూటమి ప్రభుత్వం కళలను ప్రజల ముందుకు తీసుకువచ్చేలా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తోందని మంత్రి తెలిపారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని గుంటూరులో ఘనంగా నిర్వహిస్తున్నామని, ఇకపై ప్రతి ఏటా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 'అమరావతి చిత్రకళా వీధి' నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని సాంస్కృతిక రంగానికి పూర్వవైభవం తీసుకురావడంతో పాటు కళాకారులను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఉత్సవం ద్వారా కళాకారులు, విద్యార్థులు, కళాభిమానులు, ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువస్తున్నామని తెలిపారు. ఉత్సవంలో అమరావతి శిల్పకళ, కలంకారి, శ్రీకాళహస్తి చిత్రకళ, కొండపల్లి కళలు, తోలుబొమ్మలాట, లేపాక్షి కళా సంప్రదాయాలకు సంబంధించిన స్టాళ్లు ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోలీసు పహారాలో టిడిపి సమీక్షా సమావేశం

**- సమావేశాన్ని బహిష్కరించిన తెలుగు తమ్ముళ్లు**

**చిట్వేలి మన జనప్రగతి ఆగస్టు 08:-** పోలీసుల పహారాలో చిట్వేలి మండల తెలుగుదేశం పార్టీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రైల్వే కోడూరు గ్రామీణ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు పర్యవేక్షణలో చిట్వేలి, పెనగలూరు పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్లు, 36 మంది పోలీసుల కట్టుదిట్టమైన భద్రత నడుమ చిట్వేలి రోడ్లు భవనాలు శాఖ అతిథి గృహంలో టిడిపి మండల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పోలీసులకు అందిన జాబితాలో పేర్లు ఉన్న వ్యక్తులను మాత్రం పోలీసులు అనుమతించారు. విలేకరులను సమావేశం జరుగుతున్న ప్రభుత్వ విశ్రాంతి భవనం లోకి పోలీసులు అనుమతించక పోవడం కొసమెరుపు. ఈ సమావేశానికి జోనల్ కో ఆర్డినేటర్ దామంచర్ల సత్య, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు, రైల్వే కోడూరు నియోజకవర్గం పరిశీలకులు నాగేశ్వరరావు యాదవ్, నియోజకవర్గ టిడిపి బాధ్యులు ముక్కా రూపానంద రెడ్డి హాజరయ్యారు. సమావేశం మొదలైన వెంటనే చిట్వేలి మండలానికి చెందిన రైల్వే కోడూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ మాజీ బాధ్యులు కస్తూరి విశ్వనాథ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల రాయుడు, రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల బోర్డు చైర్మన్ కేకే చౌదరి, ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్ సమావేశానికి రాకపోవడంతో చిట్వేలి మండలానికి చెందిన ప్రముఖులు లేకుండా సమావేశం జరపడం భావ్యం కాదని తెలుగుదేశం పార్టీ చిట్వేలి మండల అధ్యక్షులు కాకర్ల నాగార్జున ఆధ్వర్యంలో సమావేశాన్ని బహిష్కరించారు. అందరూ నాయకులు కలిసి వచ్చిన తరువాత సమావేశాన్ని నిర్వహించుకుందామని వారు పరిశీలకులకు రాతపూర్వకంగా తెలియజేశారు. చిట్వేలి మండలంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక్కరు మాత్రమే రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక దందా నిర్వహిస్తున్నారని, ఈ దందా నియోజకవర్గ ఇన్చార్జికి తెలియకుండా జరుగుతోందా అని పెద్దూరు రాజశేఖర్ నాయుడు జోనల్ కోఆర్డినేటర్ దామంచర్ల సత్య కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జోనల్ కోఆర్డినేటర్ సత్య మాట్లాడుతూ క్లస్టర్, యూనిట్, బూత్ బాధ్యులు, మండల పార్టీ అధ్యక్షులతో కలిసి నియోజకవర్గ బాధ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించినట్లు రాజశేఖర్ తెలిపారు.




## జిల్లా విద్యాశాఖాధికారిని కలిసిన ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు



**తాడిపత్రి మన జనప్రగతి ఆగస్టు 08:-** తాడిపత్రి కి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా విద్యాశాఖాధికారి ఆయూబ్ హుస్సేన్ తొలిసారిగా విచ్చేసిన సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారి కి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సూర్య హైస్కూల్ కరస్పాండెంట్ దూదేకుల బాబయ్య తో పాటు పలువురు కరస్పాండెంట్లు, పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అలయెన్స్ క్లబ్స్ సౌత్ మల్టిపుల్ చైర్మన్‌గా డా సరిపెల్ల



**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 08:-** ప్రముఖ సంఘ సేవకుడు పంచాంగకర్త జ్యోతిష్య వాస్తు శాస్త్ర నిపుణులు డాక్టర్ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి ని అలయెన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ సౌత్ మల్టిపుల్ కు చైర్మన్ గా ఎంపిక చేసామని ఇంటర్నేషనల్ బోర్డు తరఫున ఇంటర్నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ పాలపర్తి సుబ్బారావు ప్రకటించారు. సరిపెల్ల స్వదేశీ సేవా ఆలోచనతో సాగే ఈ అంతర్జాతీయ సంస్థ లో ప్రారంభం నుంచి వివిధ హోదాల్లో పనిచేస్తూ సంస్థ పురోభివృద్ధికి తోడ్పడుతున్నారనీ. సౌత్ మల్టిపుల్ ఛైర్మన్ సరిపెల్ల ను ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ గవర్నర్ సత్యనారాయణ విడిజి ఆకేటి సత్యనారాయణ పిడిజి లు డా వింజరపు జనార్దనం మీసాల మధు డా బొల్లాప్రగడ రామమూర్తి ప్రసాద్ జగదీశ్ గన్ని గోపాలకృష్ణ తదితరులు అభినందించారు

## పీఎం ఉష భవన నిర్మాణపనులను పరిశీలించిన వైవీయూ వీసీ



**కడప, మన జనప్రగతి, ఆగస్టు 08:-** ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్ష అభియాన్ (పి.ఎం.యుఎస్ హెచ్ ఎ) భవన నిర్మాణ పనులను యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ తనిఖీ చేశారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో రూ. 10 కోట్లతో నిర్మితమవుతున్న అకడమిక్ భవనం, ఆడిటోరియం పనులను పరిశీలించారు. పనుల నాణ్యతను, ప్రగతిని ప్రత్యక్షంగా చూశారు. ఫస్ట్ ఫ్లోర్ దాదాపుగా పూర్తిగా వచ్చిందని, సెకండ్ ఫ్లోర్ పనులను కూడా జాప్యం లేకుండా చేపట్టాలని సూచించారు. పనుల ప్రోగ్రెస్ ని స్వయంగా పరిశీలించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నట్లు పియం ఉష సమన్వయకర్త ఆచార్య టి. చంద్రశేఖర్ తెలిపారు. అలానే పి.ఎం ఉష ద్వారా పరికరాలు కొనుగోలు, జరుగుతున్న శిక్షణల గురించి వివరించారు. ఇంజనీర్ శివ పనులకు సంబంధించిన ప్రగతిని వై ఛాన్సర్ కు వివరించారు.

## ఐఐసిటి సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్‌గా వైవీయూ పరిశోధకురాలు మునిమౌనిక ఎంపిక



**కడప, మన జనప్రగతి ఆగస్టు 08:-** యోగివేమన యూనివర్సిటీ భౌతికశాస్త్ర విభాగం నుంచి ఇటీవల డాక్టరేట్ అందుకున్న డా" పార్నపల్లి ముని మౌనిక ప్రఖ్యాత కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సి ఎస్ ఐ ఆర్) ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసిటి), హైదరాబాద్ లో సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్ గా ఎంపికయ్యారు. ఫిజిక్స్ ప్రొఫెసర్ ఎం రాఘవేంద్ర పర్యవేక్షణలో ఈమె పరిశోధన పూర్తి చేశారు. మారుమూలపల్లె అయిన లోపట్నూతల గ్రామం పార్నపల్లి రామ సుబ్బయ్య , పార్నపల్లి కుమారిల కుమార్తె. తన అంకిత భావం, పరిశోధనా నైపుణ్యాలతో ఈ ప్రతిష్టాత్మక స్థానాన్ని సాధించారని మౌనిక ను యోగివేమన యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ అభినందించారు. ఐఐసిటిలో మౌనిక చేపట్టనున్న పరిశోధనలు ఉన్నత ప్రగతికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రొఫెసర్లు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు ఆమెను అభినందించారు.

# చెన్నూరులో రెండు రోజులుగా మోస్తరు భారీ వర్షాలు

**- రోడ్లపై నిలిచిన వర్షపు నీరు ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు**



**చెన్నూరు, మన జనప్రగతి ఆగస్టు 08:-** చెన్నూరు మండలం వ్యాప్తంగా రెండు రోజులుగా మోస్తరు భారీ వర్షాలు కురుస్తున్నాయి, ఎలినోవో ప్రభావంతో వర్షాలు పడవన్న భావనతో ఉన్న ప్రజలు వర్షాలు ప్రజలు ఉపశమనం పొందారు, బోరుబావుల కింద పసుపు వేరుశనగ తమలపాకు ఇతర పంటలు సాగు చేస్తున్న రైతులు మోస్తరు వర్షాలతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు, వారం రోజులుగా అల్పపీడన ప్రభావంతో ఆకాశం మెగాకృతమై తొలకరి జల్లులు పడుతున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసాయి, శుక్రవారం11,4 మిల్లీమీటర్లు, శనివారం9,6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయినట్లు మండల తాసిల్దార్ విజయ కుమారి తెలిపారు, చిన్నపాటి వర్షాలకే రోడ్లు అధ్వానంగా మారాయి, కడప కర్నూల్ జాతీయ రహదారిలో హైవే అధికారులు సక్రమంగా పనులు చేపట్టకపోవడంతో రోడ్లపై నీరు నిలిచి ప్రయాణికులకు వాహనదారులకు ఇబ్బందులు పడ్డారు, స్థానిక కొత్త రోడ్డులో రహదారి పక్కన అప్రోచ్ రోడ్డు లేకపోవడం కొత్తగా నిర్మించిన బస్సెల్టర్, దుకాణాల సముదాయాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది, హైవే అధికారులు డ్రైనేజీ అప్రోచ్ రోడ్లు వేచి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదు, ఇప్పటికైనా సంబంధిత అధికారులు అప్రోచ్ రోడ్డు డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు,

# కృష్ణా జిల్లా సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడాలి: మంత్రి కొల్లు రవీంద్ర




**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 08:-**కృష్ణా జిల్లా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే 'శ్రీవాణి' మాసపత్రిక 500వ సంచిక విడుదల కార్యక్రమంలో రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగు వారి సంస్కృతి, కృష్ణా జిల్లా సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటంలో శ్రీవాణి పత్రిక కీలక పాత్ర పోషిస్తోందన్నారు. మచిలీపట్నానికి చారిత్రక ప్రాధాన్యత ఉందని, అనేక ప్రముఖ సంస్థలు, సాహితీవేత్తలు, మానవతావాదులు ఈ ప్రాంతం నుంచి వచ్చారని తెలిపారు.కృష్ణా జిల్లా విశిష్టతను భవిష్యత్ తరాలకు తెలియజేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పేద విద్యార్థులకు విద్య అందించేందుకు కొమరగిరి కుటుంబం చేస్తున్న సేవలను మంత్రి అభినందించారు.కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ, ఒడిశా గవర్నర్ కంభంపాటి రామ్మోహన్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి: ఉషశ్రీ చరణ్




**రొద్దం మన జనప్రగతి ఆగస్టు 08:-** డీఎస్సీ2025 నియామకాల్లో జరిగిన అక్రమాలపై స్వతంత్ర సీబీఐ విచారణ జరిపించాలని, బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్ డిమాండ్ చేశారు.వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రొద్దం మేజర్ పంచాయతీలో డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలంటూ మూడవ రోజు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి కష్టపడిన నిరుద్యోగ యువత సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను, నిరుద్యోగ భృతితో సహా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు, నియామకాల్లో జరిగిన అక్రమాలపై పూర్తి స్థాయి విచారణ జరిగే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.కార్యక్రమంలో డీఎస్సీ అభ్యర్థులు, యువజన, విద్యార్థి, సోషల్ మీడియా విభాగాల నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ వినియోగంపై అవగాహన కార్యక్రమం



**పత్తికొండ మన జనప్రగతి ఆగస్టు 08 :-** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్‌ను తప్పనిసరిగా వినియోగించాలని సూచించడం జరిగింది. రోడ్డు ప్రమాదాల సమయంలో హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాణ రక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని వాహనదారులకు వివరించడం జరిగింది. ముఖ్యంగా గత 10 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా హెల్మెట్ ధరిస్తూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తున్న గుంతకల్‌కు చెందిన లెక్చరర్ హుస్సేన్ బాషా ని, అలాగే మరో వాహనదారుడిని శాలువా కప్పి ఘనంగా సన్మానించడం జరిగింది. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్న వారిని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యం.కావున ప్రతి వాహనదారుడు రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకొని ద్విచక్ర వాహనంపై ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే సమయంలో సీట్ బెల్ట్ ధరించాలని పత్తికొండ పోలీసుల తరపున విజ్ఞప్తి చేస్తున్నాము. అని అన్నారు

# మెగా డీఎస్సీపై సీబీఐ దర్యాప్తు చేయాలి

**● విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి: చల్లా సునీల్**




**పులివెందుల,మన జనప్రగతి ఆగస్టు 08:-** 2025లో నిర్వహించిన మెగా డీఎస్సీపై సీబీఐ లేదా స్వతంత్ర సంస్థతో సమగ్ర దర్యాప్తు జరిపించాలని వైఎస్సార్‌సీపీ కడప జిల్లా యువజన విభాగం కార్యనిర్వాహక సభ్యుడు చల్లా సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. డీఎస్సీ వ్యవహారంలో అవకతవకలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని కోరారు.వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పిలుపుతో పులివెందుల ఆర్డీవో కార్యాలయం వద్ద విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో శనివారం చల్లా సునీల్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ పరీక్ష విధానంలో అవకతవకలు, ప్రశ్నాపత్రాల లీకేజీల కారణంగా పలువురు నిరుద్యోగులు నష్టపోయారని ఆరోపించారు. డీఎస్సీ ప్రశ్నాపత్రాల రూపకల్పన నుంచి నియామకాల వరకు జరిగిన వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.డీఎస్సీ అభ్యర్థులు, యువతకు జరిగిన అన్యాయానికి నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ పదవికి రాజీనామా చేయాలని, లేకుంటే రాష్ట్ర ప్రభుత్వం ఆయనను మంత్రివర్గం నుంచి తొలగించాలని కోరారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని చల్లా సునీల్ హెచ్చరించారు.

# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించాలి

**● అధికారులు సమన్వయంతో పనిచేయాలి: జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**



**తిరుపతి మన జనప్రగతి ఆగస్టు 08:-** జిల్లాలో ఆగస్టు 15న నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు.శనివారం జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, ఇతర అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ వేడుకల ఏర్పాట్లపై సమీక్షించారు. శాఖల వారీగా అప్పగించిన బాధ్యతలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రోటోకాల్‌కు అనుగుణంగా జెండా ఆవిష్కరణ, సెరిమోనియల్ పరేడ్, గార్డ్ ఆఫ్ హానర్, భద్రత, డ్రోన్ పర్యవేక్షణ, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. వేడుకలకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.వేదిక, డెకరేషన్, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, లైటింగ్, టాయిలెట్లు వంటి మౌలిక సదుపాయాలను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వ శాఖల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించేలా స్టాళ్లు, శకటాలు ఏర్పాటు చేయాలని తెలిపారు.జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ పరేడ్ సిబ్బందికి శిక్షణ, పరేడ్ గ్రౌండ్ సిద్ధం, ట్రాఫిక్ నియంత్రణ, డ్రోన్ పర్యవేక్షణ, గార్డ్ ఆఫ్ హానర్ తదితర ఏర్పాట్లు కొనసాగుతున్నాయని తెలిపారు. వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

# అమ్మయ్యగారిపల్లిలో వైకాపా నేత రాఘవ రెడ్డికి పరామర్శ..

**● ఆసుపత్రి నుంచి ఇంటికి చేరుకున్న అనంతరం పరామర్శ**

**● ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన సాంబశివరెడ్డి**

**● చరవాణిలో పరామర్శించిన ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి పీ.ఏ**



**వేముల మన జనప్రగతి ఆగస్టు 08:-**వేముల మండలంలోని అమ్మయ్యగారిపల్లికి చెందిన వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నాయకుడు,మాజీ వైస్ సర్పంచ్ పోరెడ్డి రాఘవ రెడ్డిని వైఎస్ఆర్‌సీపీ వేముల మండల కన్వీనర్ నాగెళ్ల సాంబశివరెడ్డి శనివారం సాయంత్రం పరామర్శించారు.గురువారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురైన రాఘవ రెడ్డి కడపలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం స్వగ్రామంలోని తన నివాసానికి చేరుకున్నారు.రాఘవ రెడ్డి అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న నాగెళ్ల సాంబశివరెడ్డి అమ్మయ్యగారిపల్లిలోని ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆరోగ్యం ఎలా ఉందో తెలుసుకుని, వైద్యులు సూచించిన మేరకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.ఈ సందర్భంగా నాగెళ్ల సాంబశివరెడ్డి మాట్లాడుతూ రాఘవ రెడ్డి త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనే రాఘవ రెడ్డి త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితం కొనసాగించాలని కోరుకున్నారు.అదేవిధంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవ రెడ్డి చరవాణి ద్వారా పోరెడ్డి రాఘవ రెడ్డిని పరామర్శించారు.ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.రాఘవ రెడ్డిని పరామర్శించిన వారిలో వేముల రాఘవరెడ్డి, బస్సు సుబ్బారెడ్డి,సహదేవ రెడ్డి,చంద్రారెడ్డి, శ్రీనివాసులు మరియు తదితరులు ఉన్నారు.

# కోర్టుల నిర్మాణ పనులను పరిశీలన



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 08:-** కర్నూలు న్యాయస్థానంలో కొత్తగా మంజూరైన కోర్టు భవనాల నిర్మాణ పనులను న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చంద్రుడు బృందం పరిశీలించారు. శనివారం కర్నూల్‌లో నిర్మాణ పనులను న్యాయ వాదుల సంఘం అధ్యక్షుడు చంద్రుడు ఆధ్వర్యంలో న్యాయ వాదులు ప్రత్యేకంగా అక్కడికి వెళ్లి నిర్మాణ పనులపై ఆరా తీశారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న మూడు కోర్టుల నిర్మాణ పనులను పరిశీలించి న్యాయమూర్తులకు, న్యాయవాదులకు అనవైన విధంగా నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. సీనియర్ జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణ చేపట్టాలని సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో




**పత్తికొండ, మన జనప్రగతి, ఆగస్టు 08:-** పత్తికొండ పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం భారీ ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి అంబేద్కర్ సర్కిల్ మీదుగా నాలుగు స్తంభాల కూడలి వరకు ఆటోలు, ద్విచక్ర వాహనాలు, లైట్ మోటార్ వాహనాలతో ర్యాలీ నిర్వహించి అనంతరం నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఆటో కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్, సీపీఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని ఇరుకైన రోడ్ల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రోడ్డు విస్తరణ చేపట్టాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి పత్తికొండ బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఆటో కార్మికులు, రైతు సంఘం, ప్రజానాట్యమండలి నాయకులు, ద్విచక్ర వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

# దుకాణదారులకు సీఐ వెంకటేశ్వర్లు సూచన



**సిద్ధవటం, మన జనప్రగతి, ఆగస్టు 08:-** రహదారికి ఇరువైపులా ఉన్న అడ్డంకులు, ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సీఐ వెంకటేశ్వర్లు దుకాణదారులకు సూచించారు. శనివారం సాయంత్రం మండలంలోని భాకరాపేట, మాధవరం గ్రామాల్లో రహదారుల వెంట ఉన్న దుకాణాలను పరిశీలించి యజమానులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రహదారులకు అడ్డంగా దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడటంతో పాటు ప్రమాదాలకు అవకాశం ఉంటుందని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా దుకాణాల ముందు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. హైవే రోడ్డుపై ఉన్న డాబా హోటళ్లను రాత్రి 10 గంటలలోపు మూసివేయాలని, నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే కొంతమంది ద్విచక్ర వాహనదారులు కిరాణా దుకాణాల వద్ద వాహనాలను నిలిపివేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. ఏఎస్ఐ సుబ్బరామచంద్ర, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

**కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్.**



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 08:-** ప్రతి శనివారం రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సంధర్బంగా ఈ రోజు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసుస్టేషన్ పరిధులలో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల పై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బైక్ లు నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా , ఓవర్ స్పీడ్ , ఓవర్ లోడ్ తో వాహనాలు వెళ్ళకుండా, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని తదితర రోడ్డు భద్రత ప్రాముఖ్యతల పై ప్రజలకు అవగాహన కల్పించారు.

# మెగా డీస్సీ స్కామ్‌కు బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 08:-** ఏపీ మెగా డీఎస్సీ-2025 స్కామ్ స్పోర్ట్స్ కోటాలో జరిగిన అక్రమాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నిస్సార్ భాష (810) డిమాండ్ చేసారు. వైయస్సార్సీపి అధిష్టానం, మాజీ ముఖ్యమంత్రివర్యులు శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఆంధ్ర రాష్ట్రం లోని అన్ని జిల్లా లోని నియోజకవర్గ కేంద్రాల్లో రిలే నిరాహార దీక్షలకు పిలుపునివ్వడం జరిగింది. అందులో భాగంగా పులివెందుల నియోజకవర్గం కేంద్రంగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రచార సంయుక్త కార్యదర్శి నిస్సార్ భాష(810) పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు.మా ప్రధాన డిమాండ్లు:డీఎస్సీ-2025 అక్రమాలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలన్నారు.పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు.నిరుద్యోగ భృతిని తక్షణమే అమలు చేయాలన్నారు.ఈ డిమాండ్లతో వేంపల్లి, వేముల, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, యువత రిలే నిరాహార దీక్షలో పాల్గొని ప్రభుత్వ వైఖరిపై వైయస్సార్సీపీ నాయకులు, మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి, కల్లూరు చంద్రబాబు రెడ్డి, మునీర్, మెడికల్ స్టోర్ బాబా, రాజ్ కుమార్, ఖాన్,కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు.

# నాటి జ్ఞాపకాలే..ఆత్మీయ కలయిక

**- 2005-2006 పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం**



**బొమ్మనహాల్ మన జనప్రగతి ఆగస్టు 08:-**మండల పరిధిలో ఉద్దేహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉద్దేహాల్‌లో 2005-2006 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు,పదో తరగతి చదివి సుమారు 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పూర్వ విద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకుని నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు,చిన్ననాటి స్నేహితులను చాలా కాలం తర్వాత కలుసుకోవడంతో పాఠశాల ఆవరణలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది,ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆదిశేషయ్య,రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు మేరీరోజ్ రాజేశ్వరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు,ఈ అనంతరం నాటి ఉపాధ్యాయులు రాఘవేంద్ర, పరమేశ్వర,రహీం,మునీంద్ర, సలాం,శ్రీనివాసులు,ప్రదీప్‌లను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు,తమకు విద్యాబుద్ధులు నేర్పి,జీవితంలో ముందుకు సాగేందుకు మార్గనిర్దేశం చేసిన గురువులకు పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు,అదేవిధంగా ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజుల అనుభవాలను గుర్తుచేసుకున్నారు,అప్పటి తరగతి గది జ్ఞాపకాలు, స్నేహితులతో కలిసి గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు,విద్యార్థి దశలో తమకు ఎదురైన అనుభవాలు, అప్పటి స్నేహబంధాలను గుర్తుచేసుకుని భావోద్వేగానికి లోనయ్యారు,ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు నరసింహులు,శ్రీరాములు, ఉమాశంకర్,మల్లిక,శ్రీకాంత్, ఉలిగన్న,రోజా,రమ్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు,పాత స్నేహితులంతా కలిసి ఆత్మీయంగా,ముచ్చటించుకోవడంతో పాటు భవిష్యత్తులోనూ ఇలాంటి సమ్మేళనాలు నిర్వహించుకుని తమ స్నేహబంధాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు.

# టీడీపీ కార్యకర్త మృతి.. కుటుంబానికి ఆర్థిక సాయం



**బొమ్మనహాల్ మన జనప్రగతి ఆగస్టు 08:-**మండలం పరిధిలో కందేపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త బోయ వెంకటేషులు అనారోగ్యంతో శనివారం మృతి చెందారు, విషయం తెలుసుకున్న,ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆదేశాల మేరకు మండల టీడీపీ నాయకులు కొత్తపల్లి మహేంద్ర,కందేపల్లి గ్రామానికి చేరుకుని వెంకటేషులు కుటుంబ సభ్యులను పరామర్శించారు,అనంతరం వెంకటేషులు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు,మృతుడి కుటుంబానికి పార్టీ తరఫున అండగా నిలుస్తామని భరోసా కల్పిస్తూ రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం కొత్తపల్లి మహేంద్ర మాట్లాడుతూ..వెంకటేషులు మృతి పార్టీకి తీరని లోటు అన్నారు,ముఖ్యంగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ కార్యకర్తగా సేవలందించిన ఆయన ఇక లేరనే విషయం చాలా బాధాకరమన్నారు,వెంకటేషులు కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు,మృతుడి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని కోరుకున్నారు, ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు,కార్యకర్తలు, పాల్గొన్నారు.

# డీఎస్సీ అక్రమాలను ప్రజలకు వివరిస్తూ మూడు రోజులుగా రిలే దీక్షలు



**పత్తికొండ మన జన ప్రగతి ఆగస్టు 08 :-**వైఎస్ఆర్ పార్టీ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలను పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ గారు, తుగ్గలి, మద్దికెర మండలాల నాయకులతో కలిసి నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ గారు మాట్లాడుతూ.. డీఎస్సీలో జరిగిన మోసాలను, అక్రమాలను గత మూడు రోజులుగా ప్రజలకు వివరిస్తూ రిలే నిరాహార దీక్షలు చేపట్టామని తెలిపారు. ఈ దీక్షలకు సంఘీభావం తెలిపిన సీపీఐ, ఏఐవైఎఫ్ ఏఐవైఎఫ్ న్యాయవాదులకు ఆమె ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.డీఎస్సీలో జరిగిన అక్రమాలను ప్రజలకు వివరించామని, నిరుద్యోగ యువతీ యువకులకు న్యాయం జరిగే వరకు వారి తరఫున నిరంతరం పోరాటం చేస్తామని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రజా ఉద్యమాలు చేపట్టి, నిరుద్యోగ యువతీ యువకులకు వైఎస్ఆర్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.సోమవారం నిర్వహించనున్న భారీ ర్యాలీలో నిరుద్యోగ యువతీ యువకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని కంగాటి శ్రీదేవమ్మ గారు పిలుపునిచ్చారు.

# రాయలసీమపై కూటమి నేతలు కుట్రలు చేస్తున్నారు



**అనంతపురం, మన జనప్రగతి, ఆగస్టు 08:-** రాజకీయ అవసరాల కోసం గతంలో ఒకరినొకరు విమర్శించుకున్న బీజేపీ, టీడీపీ, జనసేన నేతలు ఇప్పుడు కలిసి రాయలసీమకు అన్యాయం చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అమరావతి అభివృద్ధిపై దృష్టి పెడుతున్న ప్రభుత్వం రాయలసీమకు జీవనాడిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు, కడప ఉక్కు పరిశ్రమ వంటి అంశాలను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు.కృష్ణా నదిపై సిద్ధేశ్వరం బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మాణం ద్వారా నీటిని నిల్వ చేసి రాయలసీమకు మళ్లించే అవకాశాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కర్ణాటక, తెలంగాణలో కొత్త సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు వస్తున్నప్పటికీ, రాయలసీమ ప్రాజెక్టుల విషయంలో నిర్లక్ష్యం చూపుతున్నారని విమర్శించారు.2018లో బీజేపీ ప్రకటించిన కర్నూలు రాయలసీమ డిక్లరేషన్‌ను అమలు చేయకపోవడంతో పాటు కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయకపోవడం ద్వారా శ్రీబాగ్ ఒప్పందానికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేసి, ప్రాంతీయ సమతుల్య అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ప్రపంచ రికార్డు సాధనకు సిద్ధమైన ఆల్వాల్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ కరాటే క్రీడాకారుడు వి. సుధాకర్




**హైదరాబాద్,మన జనప్రగతి ఆగస్టు 08:-** తెలంగాణకు చెందిన జాతీయ స్థాయి కరాటే క్రీడాకారుడు, మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని ఆల్వాల్ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వి. సుధాకర్ అంతర్జాతీయ స్థాయిలో ప్రపంచ రికార్డు సాధించేందుకు సిద్ధమవుతున్నారు.జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో, ప్రముఖ కరాటే గురువు డా. జి.ఎస్. గోపాల్ రెడ్డి పర్యవేక్షణలో, భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రపంచ రికార్డు ప్రయత్నంలో వి. సుధాకర్ పాల్గొననున్నారు.ఈ రికార్డు ప్రయత్నంలో 9 రకాల కరాటే టెక్నిక్స్‌తో కేవలం 8 నిమిషాల్లో 80 శాబాద్ (రాక్) టైల్స్‌ను విరగగొట్టే సాహసాన్ని ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమం ఆగస్టు 9న హైదరాబాద్‌లోని జీవీఆర్ కరాటే అకాడమీలో నిర్వహించబడనుంది.వి. సుధాకర్ 2013లో జీవీఆర్ కరాటే అకాడమీలో చేరి కరాటేలో శిక్షణ పొందుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచారు. ఆల్ ఇండియా ప్రిజన్స్ డ్యూటీ మీట్లో జాతీయ స్థాయిలో కాంస్య పతకం సాధించడంతో పాటు, పలు రాష్ట్ర, జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలను కైవసం చేసుకుని తన ప్రతిభను చాటుకున్నారు.ప్రస్తుతం ఆల్వాల్ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా ప్రజాసేవ అందిస్తూనే, క్రీడా రంగంలోనూ నిరంతర సాధన కొనసాగిస్తున్న వి. సుధాకర్ ప్రపంచ రికార్డు ద్వారా తెలంగాణ రాష్ట్రానికి, భారతదేశానికి మరింత గౌరవం తీసుకురావాలనే లక్ష్యంతో సిద్ధమవుతున్నారు.ఈ సందర్భంగా జీవీఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు, ప్రధాన శిక్షకులు డా. జి.ఎస్. గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, వి. సుధాకర్ క్రమశిక్షణ, అంకితభావం, కఠోర సాధనకు ప్రతీక అని, ప్రపంచ రికార్డు ప్రయత్నంలో విజయవంతమై తెలంగాణకు, దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.

# కళాకారుల ఆత్మగౌరవాన్ని కాపాడుతాం: మంత్రి దుర్గేష్

**- పౌరాణిక, సాంఘిక నాటకాలకు పూర్వవైభవం**

**విజయవాడ మన జనప్రగతి, ఆగస్టు 08:-** తెలుగు నాటక రంగం, పద్య నాటకాలు, జానపద కళారూపాలకు పూర్వవైభవం తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కళాకారుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. విజయవాడలో నాటక అకాడమీ నూతన సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ సమక్షంలో 22 మంది సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. మంత్రి దుర్గేష్ వారిని సత్కరించి అభినందించారు.కళాకారుల కోసం గతంలో ఉన్న ప్రత్యేక పెన్షన్‌ను పునరుద్ధరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో చర్చించి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామస్థాయి కళాకారులను ప్రోత్సహిస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు, నాటక అకాడమీ సభ్యులు, కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.



# పెన్నహోబిలం లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్



**ఉరవకొండ మన జనప్రగతి ఆగస్టు 08:-** ఉరవకొండ మండలంలోని పెన్నహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానాన్ని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్రీ శ్యామ్ ప్రసాద్ కుటుంబ సమేతంగా శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.కలెక్టర్‌కు దేవస్థానం అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలను కలెక్టర్‌కు అందజేశారు.ఈ సందర్భంగా ఆలయ విశేషాలు, దేవస్థానంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి అర్చకులు వివరించారు. కలెక్టర్ కుటుంబ సభ్యులు స్వామివారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి: మంత్రి అచ్చెన్నాయుడు



**కురుపాం, మన జనప్రగతి, ఆగస్టు 08:-** రైతులు సంప్రదాయ వరి సాగుకే పరిమితం కాకుండా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ, డిమాండ్ ఉన్న పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. రైతుల అభివృద్ధి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.కురుపాం మండలం గురుగుబిల్లి గ్రామంలో నిర్వహించిన 'గట్టు మీద చెట్టు' కార్యక్రమంలో మంత్రి పాల్గొని రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆధునిక సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని కోరారు.చేల గట్ల వెంట ఉపయోగకరమైన చెట్లను పెంచడం ద్వారా అదనపు ఆదాయం పొందడంతో పాటు పర్యావరణాన్ని కాపాడవచ్చని తెలిపారు. సాగునీరు, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్రాల విషయంలో ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకరరెడ్డి, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# ఓబీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలి




**న్యూఢిల్లీ, మన జనప్రగతి, ఆగస్టు 08:-** ఓబీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని పలువురు ఎంపీలు, మాజీ ప్రజాప్రతినిధులు, సామాజిక మేధావులు పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో బి.పి. మండల్ సేన ఆధ్వర్యంలో ఓబీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ల ఆవశ్యకతపై జాతీయ సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా 1992లో అప్పటి మచిలీపట్నం ఎంపీ దివంగత కొలుసు పెదరెడ్డయ్య యాదవ్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఓబీసీ రాజకీయ రిజర్వేషన్ల ప్రైవేట్ మెంబర్ బిల్లు పుస్తకాన్ని ఆవిష్కరించారు. మండల్ కమిషన్ సిఫారసులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ఓబీసీలకు చట్టసభల్లో రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని సదస్సు డిమాండ్ చేసింది.సదస్సులో డీఎంకే రాజ్యసభ సభ్యుడు పి. విల్సన్, ఆర్జేడీ ఎంపీ సంజయ్ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నేత రఘువీరారెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు, ప్రొఫెసర్ కంచ ఐలయ్య షెఫర్డ్, మాజీ ఐపీఎస్ అధికారి బీవీ రమణకుమార్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బి. ఉదయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. బీసీల రాజకీయ హక్కుల సాధన కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు.

మనజనప్రగతి

09- 08 - 2026

# వైసీపీ నేరగాళ్ల ముఠా

## రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఫైర్

## బీసీలను గండెల్లో పెట్టుకుంటున్నాం

## ప్రజల ఆశలు నిలబెట్టుకుంటూ పాలిస్తున్నాం

## కుర్చీ కోసమే జగన్ అరాచక యాత్రలు

## సొంత పార్టీ కార్యకర్తలను సైతం బలి తీసుకుంటున్నారు: మంత్రి సవిత పిలుపు




**అమరావతి మన జనప్రగతి ఆగస్టు 08;–** కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల నుంచి ఏపీలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సీఎం చంద్రబాబునాయుడు రేయింబవళ్లు శ్రమిస్తుంటే, అధికారం కోసం తన క్రిమినల్ బ్యాచ్ తో జగన్ రాష్ట్రంలో అల్లకల్లోలం సృష్టిస్తున్నారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత మండిపడ్డారు. సొంత పార్టీ కార్యకర్తలను సైతం బలిపెడుతున్న నేరగాళ్ల ముఠా వైసీపీ అని తీవ్రంగా విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో వైసీపీని పునాదులతో సహా భూస్థాపితం చేయాలని ప్రజలకు మంత్రి సవిత పిలుపునిచ్చారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్రంలో సుపరిపాలనకు పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆశీస్సులతో, విజనరీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, దూరదృష్టి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. పరిశ్రమలను ఆహ్వానిస్తూ, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ భావితరాల భవిష్యత్తుకు బంగారు పునాదులు వేస్తున్నారన్నారు. పరిశ్రమలు, పెట్టుబడులు ఊరికే రావని, సీఎం చంద్రబాబు విజన్, నమ్మకమైన పాలన వల్లే పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి తరలొస్తున్నారని అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టులు నిర్మిస్తూనే.. ఒకవైపు 'రైజింగ్ రాయలసీమ', మరోవైపు ఉత్తరాంధ్ర అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని మంత్రి సవిత తెలిపారు. **ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నాం** గత వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని మంత్రి సవిత మండిపడ్డారు. ఏటా జాబ్ క్యాలెండర్, సంపూర్ణ మద్యపాన నిషేధం, రూ.3 వేల పెన్షన్ అంటూ ప్రజలను దారుణంగా మోసం చేశారని మండిపడ్డారు. వచ్చేవారిని బెదిరించి, ఉన్న పరిశ్రమలను తరిమేసి రాష్ట్రాన్ని దశాబ్దాల వెనక్కి నెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో 151 సీట్లతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని తీవ్రంగా నష్టపరిచిందన్నారు. హత్యా రాజకీయం, విధ్వంసం, దోచుకోవడం, దాచుకోవడమే లక్ష్యంగా పాలన సాగించింది. బడుగు, బలహీన వర్గాలు, దళితులపై దౌర్జన్యాలు చేస్తూ రాష్ట్రాన్ని భూస్థాపితం చేశారని మండిపడ్డారు. వైసీపీ అరాచక పాలనకు ప్రజలు తమ ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పారన్నారు. రాష్ట్రానికి స్పష్టమైన రాజధాని ఉండాలని, పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలని, చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనే రాష్ట్రం బాగుపడుతుందని నమ్మి కూటమికి సంపూర్ణ మెజారిటీ కట్టబెట్టారన్నారు. ప్రజలు ఏ ఆశతోనైతే కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారో, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని మంత్రి సవిత వెల్లడించారు. **బీసీలను గుండెల్లో పెట్టుకుంటున్నాం** బడుగు, బలహీన వర్గాలను కేవలం ఓటు బ్యాంకుగానే జగన్మోహన్ రెడ్డి వాడుకున్నారన్నారని మంత్రి సవిత మండిపడ్డారు. నాటి మహానాయకుడు నందమూరి తారక రామారావు కాలం నుంచి నేటి లోకేష్ వరకు టీడీపీ ఎల్లప్పుడూ బలహీన వర్గాలను గుండెల్లో పెట్టుకుని ఆదుకుంటోందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనకు, ఈ రెండేళ్ల కూటమి సుపరిపాలనకు తేడాను ప్రజలు గమనిస్తున్నారు. **జగన్‌కు సొంత పార్టీ కార్యకర్తలే పావులు.** శవయాత్రలు, పాదయాత్రల పేరుతో జగన్మోహన్ రెడ్డి సొంత పార్టీ కార్యకర్తలనే బలి తీసుకునేలా రెచ్చగొడుతున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. గొడ్డలి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి సొంత రాజకీయ లబ్ధి కోసం, కుర్చీ కాపాడుకోవడం కోసం ఎంతటికైనా తెగిస్తారన్నారు. వైసీపీ కార్యకర్తలు ఈ విషయాన్ని గ్రహించి అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. వైసీపీ అంతర్గత విభేదాలతో జయవర్ధన్ రెడ్డి, ఇబ్రహీంపట్నంలో భార్గవ్, రాంబాబు, కడపలో జగన్ మేనమామ చేతుల్లో దస్తగిరి, మాచర్లలో పిన్నెల్లి వెంకట్రామరెడ్డి ముఠా చేతిలో చెన్నారెడ్డి బలయ్యారన్నారు. వివేకానంద రెడ్డి హత్య విషయం అందరికంటే ముందే జగన్‌కే తెలుసని వైఎస్ సునీత ఆనాడే తెలిపారన్నారు. అధికారం కోసం సొంత బాబాయినైనా, నమ్ముకున్న కార్యకర్తనైనా బలి తీసుకోవడానికి వైసీపీ వెనుకాడదని ఈ ఘటనలు రుజువు చేస్తున్నాయని మంత్రి సవిత తెలిపారు. **జగన్ రెడ్డి పని అయిపోయినట్లేనా...?** వైసీపీ అనేది ఒక రాజకీయ పార్టీ కాదని, అది నేరస్తుల ముఠా అని మంత్రి సవిత మండిపడ్డారు. పలాసాలో పేద గొర్రెల కాపరి, నిరుపేద కుటుంబానికి చెందిన దానయ్య యాదవ్‌ను పొట్టనబెట్టుకుంటే, ఆ కుటుంబాన్ని జగన్ పరామర్శించలేదన్నారు. పైగా హంతకులను కలిసి భరోసా ఇస్తున్నారన్నారు. 'చనిపోయిన వ్యక్తికి 44 ఏళ్లు దాటాయంటూ జగన్ అపహాస్యం చేయడం సరికాదన్నారు. వైఎస్ అవినాష్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, అంబటి రాంబాబు, జోగి రమేష్ వయసెంత..మీ వయస్సు అయిపోయింది కదా... మీ పని అయిపోయినట్లేనా.. కుర్చీ ఎక్కడానికి, పదవులు అనుభవించడానికి మీ వయసులు సరిపోతాయా' అని ప్రశ్నించారు. చనిపోయిన వ్యక్తికి 44 ఏళ్లు అని చిన్నచూపు చూస్తూ, నిందితులను కాపాడేందుకు ప్రయత్నించడం బీసీ, బడుగు, బలహీన వర్గాల పట్ల జగన్‌కున్న అసలైన నైజానికి నిదర్శనమని బయటపడిందన్నారు. జగన్ శ్రీకాకుళం పర్యటనలో వైసీపీ నేత చింత రవి ఏకంగా విధులు నిర్వహిస్తున్న ఒక మహిళా పోలీసుపైనే దౌర్జన్యానికి పాల్పడితే, మాజీ మంత్రి అంబటి రాంబాబు చట్టాన్ని గేలిచేస్తూ పోలీసులపై నిత్యమూ దాడికి దిగుతున్నారన్నాని మంత్రి సవిత మండిపడ్డారు.

# నాలుగేళ్ల బి.ఎఫ్.ఏ. కోర్స్‌లో ప్రవేశానికి దరఖాస్తులు





**కడప,మన జనప్రగతి, ఆగస్టు 08:–** యోగి వేమన యూనివర్సిటీ లో లలిత కళల విద్యా ( బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ )నాలుగు సంవత్సరాల కోర్సు పూర్తి చేసిన విధ్యార్థులకి , పోస్ట్ గ్రాడ్యుయేషన్ కి వెళ్లకుండానే అధిక వేత్తనాలతో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా ఇక్కడ ఇచ్చే శిక్షణ వల్ల అనేక రంగాలకి మార్గం గా వుంది ఈ కోర్స్ . ప్రొఫెషనల్ చిత్రాకారుడు గా , ఇంటీరియర్ డిజైన్ , పిల్లల బొమ్మల తయారీ . టి. వి ., సినిమా రంగాలలో విస్తృత అవకాశాలు ఉన్నాయి. అంతేకాక కేంద్రీయ విద్యాలయా, నవోదయ స్కూళ్ళలో అధ్యాపకులు గా పుష్కలం గా అవకాశాలు ఉన్నాయి. విగ్రహాలు తయారీ, పార్క్ డిజైన్, మ్యూజియం లలో త్వరగా జాబ్ లు ఉన్నాయి. గందర గోళం గా మారుతున్న నేటి పరిస్థితి లో, సమాజం లో ప్రతి ఒక్కరికీ మానసిక సంతోషం ముఖ్య అవసరమని , ఇలాంటి విధ్య వల్లే ప్రశాంతత సాధ్యం. ఇంటర్ లేదా డిప్లమో పూర్తి చేసిన వారు ఈ నాలుగేళ్ల బి. ఎఫ్. ఏ. కోర్స్ లో ప్రవేశానికి అర్హులు. ఈ నెల 11 వ తేదీ లోపు ధరఖాస్తులు చేసుకోవాలి. లలో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఈ విభాగం లో జాయిన్ కావాలంటే , ఆసక్తి , అర్హత గల వారు ఓఏఎండీసీ వెబ్ సైటు, / cets.apche.ap.gov.in లేదా www.yvu.edu.in లలో రిజిస్టర్ చేసుకోవచ్చు. ఇతర సమాచారశీ కొరకు డాక్టర్ కోట మృత్యుంజయ రావు , విభాగాధిపతి 9492345419 నంబరు కి సంప్రదించగలరు. ఉపాధి అవకాశాలు విస్తృతం తెలుగు రాష్ట్రం లలో భోధన లో అగ్రగామి గా ఉన్నాం. మా విభాగం లో కోర్స్ పూర్తి చేసిన వారికి ఉపాధి అవకాశాలు పుష్కలం గా ఉన్నాయి. కోర్స్ పూర్తవగానే జాబ్ పొందటం మా విభాగం ప్రత్యేకత అని . ఆ మేరకు విధ్యార్థులకి తర్ఫీదు ఇస్తున్నామని చెప్పారు. తల్లితండ్రుల మీద ఆధారపకుండా చదువుకుంటూ అదనపు సమయాన్ని వినియోగించుకొని నెలకు కనీసం ఇరవై వేల రూపాయలు సంపాదించే అవకాశం ఉంది. ముఖ్య పట్టణంలో ఎంతో గిరాకీ ఉన్న కోర్స్ ఇది. ప్రత్యేక ఆర్ట్ గ్యాలరీ మా విధ్యార్థులకు ఒక గొప్ప అవకాశం. –డాక్టర్ కోట మృత్యుంజయ రావు , విభాగధిపతి , లలితకళా విభాగం , వై . వి యు.

# ఘనంగా టిడిపి మహిళా నేత పుష్పావతి యాదవ్ పుట్టినరోజు వేడుకలు





**తిరుపతి మన జనప్రగతి ఆగస్టు 08:–** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సీనియర్ మహిళా నాయకురాలు, ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షురాలు పుష్పావతి యాదవ్ పుట్టినరోజు వేడుకలు శనివారం తిరుపతిలో పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పుష్పావతి యాదవ్ ను కలసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతి నగరంలోని 11 క్లస్టర్ ఇంచార్జ్ పుష్పావతి యాదవ్ పుట్టినరోజును పురస్కరించుకొని 11వ డివిజన్లో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోదూరు బాలసుబ్రమణ్యం గారి నివాసం వద్ద పుష్పావతి యాదవ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన నాయకులందరూ భారీ కేక ను కట్ చేశారు. ఆమె తెలుగుదేశం పార్టీలో మూడు దశాబ్దాలకు పైగా క్రమశిక్షణ గల మహిళ నేతగా పార్టీ ఆదేశాలను శిరసా వహిస్తూ పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మహా నేత అని పలువురు కొనియాడారు. ఆమెకు శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, భవిష్యత్తులో రాజకీయంగా మరి ఎంతో ఉన్నతమైన పదవులు అలంకరించాలని నాయకులు ఆకాంక్షించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో టిడిపి రాష్ట్ర నేతలు బుల్లెట్ రమణ, సూరా సుధాకర్ రెడ్డి, కృష్ణ యాదవ్, మునిశేఖర్ రాయల్, బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు విశ్వనాథ్ కుప్పయ్య హేమావతి నందగోపాల్ నాయుడు ప్రమోద్ కుమార్ సతీష్ మునుకుమార్ జుబేదా ఖాజా లు తెలిపిన వారిలో ఉన్నారు. ఇంతకు మునుపు ఆమెకు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులతో పాటు బిజెపి, జనసేన నాయకులు ఫోన్ ద్వారా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. టీటీడీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి వి రామచంద్ర యాదవ్, పుష్పావతి యాదవ్ దంపతులను గజ పూలమాలతో టీటీడీ ఉద్యోగ సంఘ నేతలు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# లయన్స్ సేవా సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా ఎన్నికైన డాక్టర్ రవి కృష్ణను అభినందించిన వివిధ సంస్థలు

## డాక్టర్ రవి కృష్ణ ను సత్కరించిన లయన్స్ క్లబ్, కళారాధన,నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం, నంద్యాల జిల్లా చిన్న వీధి వ్యాపారస్తుల సంక్షేమ సంఘం ప్రతినిధులు





**నంద్యాల, మన జనప్రగతి, ఆగస్టు 08:**కళారాధన వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం, నంద్యాల జిల్లా చిన్న వీధి వ్యాపారస్తుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు, రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షులు,గత 30 సంవత్సరాలుగా నంద్యాల లయన్స్ క్లబ్ ద్వారా విస్తృత సేవలు అందిస్తున్న డాక్టర్ గుర్రాల రవికృష్ణ అంతర్జాతీయ లయన్స్ సేవా సంస్థ డిస్ట్రిక్ట్ 316 జె వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గా గత వారం బాధ్యతలు తీసుకున్న సందర్భంగా కళారాధన, లయన్స్ క్లబ్,నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం, నంద్యాల జిల్లా చిన్న,వీధి వ్యాపారస్తుల సంక్షేమ సంఘం ప్రతినిధులు స్థానిక కళారాధన, దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా సేవలు విస్తృతం చేస్తామని, కళారాధన సాంస్కృతిక కార్యక్రమాలు, దివ్యాంగుల సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తామని, చిన్న వీధి వ్యాపారస్తుల ఉపాధి రక్షణ కోసం సహకరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సందీప్,మేడా చంద్రశేఖర్, కోశాధికారి సురేష్, జోన్ చైర్మన్ సోమేశుల నాగరాజు,ఉపాధ్యక్షులు పోసిన సుబ్బారావు,కళారాధన కార్యనిర్వాహక కార్యదర్శి, ప్రముఖ నాటక, సినీ, టీవీ నటులు ఎస్.ఆర్.ఎస్. ప్రసాద్, కార్యదర్శి డి. సి. పి. శర్మ, కార్యవర్గ సభ్యులు శివరామిరెడ్డి, రామయ్య, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.పీ.వి.రమణయ్య, కార్యదర్శి రామలింగం, హనీఫ్ ఖాన్, వెంకటరావు,నంద్యాల జిల్లా చిన్న వీధి వ్యాపారస్తుల సంక్షేమ సంఘం అధ్యక్షులు మహబూబ్ బాషా , కార్యదర్శి మహేష్, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174